PRGI REGD NO: TGTEL/25/A1385

Circulated to Telangana
Published from Jagitial

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక

www.evarthalu.com

సోమవారం MONDAY 27-7-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 2 Volume:2 | సంచిక: 28 Issue: 28

27 జూలై 2026 - సోమవారం శ్రీ పరాభవ నామ సంవత్సరం దక్షిణాయనం - గ్రీష్మ ఋతువు ఆషాడ మాసం - శుక్లపక్షం సూర్యోదయం - తె. 5:57 సూర్యాస్తమయం - సా. 6:47 తిథి త్రయోదశి సా. 4:13 వరకు తరువాత చతుర్దశి సంస్కృత వారం ఇందు వాసరః నక్షత్రం మూల ఉ. 10:20 వరకు తరువాత పూర్వాషాఢ యోగం వైధృతి రా. 10:43 వరకు కరణం తైతుల సా. 4:13 వరకు గరజ తె. 5:18ం వరకు వర్జ్యం ఉ. 8:39 నుండి ఉ. 10:27 వరకు దుర్ముహూర్తం మ. 12:48 నుండి మ. 1:39 వరకు మ. 3:22 నుండి సా. 4:13 వరకు రాహుకాలం ఉ. 7:33 నుండి ఉ. 9:10 వరకు యమగండం ఉ. 10:46 నుండి మ. 12:22 వరకు గుళికాకాలం మ. 1:58 నుండి మ. 3:35 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:21 నుండి తె. 5:09 వరకు అమృత ఘడియలు లేదు అభిజిత్ ముహూర్తం ఉ. 11:56 నుండి మ. 12:48 వరకు గమనిక: "ం" అనగా మరుసటి రోజున



## జూనియర్ స్క్వాష్ క్వీన్.. అనహత్

భారత యువ స్క్వాష్ సంచలనం అనహత్ సింగ్ చరిత్ర సృష్టించింది. వరల్డ్ జూనియర్ స్క్వాష్ ఛాంపియన్‌షిప్‌లో విజేతగా నిలిచింది. టాప్ సీడ్, వరల్డ్ నంబర్ 20 అయిన అనహత్, ఫైనల్‌లో ఈజిప్ట్‌కు చెందిన రెండో సీడ్ రుఖయ్యా సలేంను 11-3, 11-7, 11-9 తేడాతో వరుస గేముల్లో ఓడించింది.



## మీరాబాయి.. బంగారం

భారత వెయిట్‌లిఫ్టింగ్ చరిత్రలో మరో స్వర్ణాధ్యాయాన్ని లిఖిస్తూ స్టార్ లిఫ్టర్, ఒలింపిక్ పతక విజేత మీరాబాయి చాను మహిళల 48 కేజీల విభాగంలో పసిడి పతకాన్ని ముద్దాడింది. కామన్వెల్త్ గేమ్స్-2026లో భాగంగా ఆదివారం జరిగిన పోటీలో అద్వితీయ ప్రదర్శన కనబరిచిన ఆమె, వరుసగా మూడోసారి కామన్వెల్త్ గేమ్స్‌లో స్వర్ణం గెలిచి చారిత్రాత్మక హ్యాట్రిక్ పూర్తి చేసింది.



# యువశక్తీ.. సలాం!

## యువతను చూసి గర్వపడుతున్నా

### 'విక్రమ్-1'తో రోదసిలో నవశకం.. 'మన్ కీ బాత్'లో ప్రధాని మోదీ

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన నెలవారీ రేడియో కార్యక్రమం 'మన్ కీ బాత్' 136వ ఎపిసోడ్‌లో దేశ యువత సాధిస్తున్న విజయాలపై ప్రశంసల వర్షం కురిపించారు. అంతరిక్షం నుంచి సైన్స్ ఒలింపియాడ్స్ వరకు వివిధ రంగాల్లో యువత అద్భుత ప్రతిభ కనబరుస్తోందని, దేశ యువశక్తిని చూసి తాను ఎంతో గర్వపడుతున్నానని అన్నారు. ఇటీవల విజయవంతమైన 'విక్రమ్-1' ప్రయోగం ప్రతి భారతీయుడి హృదయాన్ని గర్వంతో నింపిందని మోదీ పేర్కొన్నారు.

న్యూఢిల్లీ: ఇది వికసిత భారత్ లక్ష్యంలో ప్రైవేటు రంగం అభివృద్ధి చేసిన తొలి రాకెట్ అని, భారత అంతరిక్ష రంగంలో ఇదొక చారిత్రాత్మక ఘట్టమని అభివర్ణించారు. ఒకప్పుడు ఊహించలేనిదాన్ని మన యువ ఆవిష్కర్తలు సుసాధ్యం చేశారని, వారిలో అసాధారణ నైపుణ్యం, పట్టుదల ఉన్నాయని కొనియాడారు. చాలాకాలంగా ప్రైవేటు రంగానికి దూరంగా ఉన్న అంతరిక్ష రంగాన్ని యువత ఆసక్తిని దృష్టిలో ఉంచుకుని తెరిచామని, దాని ఫలితాలను నేడు ప్రపంచం చూస్తోందని వివరించారు. అంతరిక్ష రంగంలోనే కాకుండా, సైన్స్ రంగంలోనూ మన యువత దేశానికి గర్వకారణంగా నిలుస్తోందని ప్రధాని తెలిపారు. ప్రపంచంలోనే అత్యంత ప్రతిష్ఠాత్మకమైన సైన్స్ ఒలింపియాడ్స్‌లో భారత విద్యార్థులు అద్భుత తరువాయి 2 వ పేజీలో...

### ప్రశాంతంగా నిద్రపోయా: దీప్కే

# 'పెద్ది'కి పునర్జన్మ



### బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డికి గుండెపోటు
### హనుమకొండలోని రోహిణి దవాఖానకు తరలింపు
### 9 సార్లు సీపీఆర్ చేసి బతికించిన డాక్టర్ మమతారెడ్డి
### మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలింపు
### వైద్యురాలికి మాజీమంత్రి హరీశ్ రావు కృతజ్ఞతలు

బీఆర్ఎస్ నేత, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి ఆదివారం ఉదయం తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. హఠాత్తుగా ఆయనకు గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు ఆయనను హనుమకొండలోని రోహిణి ఆసుపత్రికి తరలించారు. అప్పటికే పరిస్థితి విషమంగా ఉండటంతో ఆస్పత్రి వైద్యురాలు డాక్టర్ మమతారెడ్డి.. కార్డియో ఎమర్జెన్సీకి తరలించి సీపీఆర్ నిర్వహించారు.

హనుమకొండ/హైదరాబాద్, జూలై 26 (ఈవార్తలు):ఆయన గుండె స్పందన పూర్తిగా ఆగిపోయిన పరిస్థితిలో వరుసగా 8 సార్లు సీపీఆర్ చేసినా స్పందన రాకపోయినా ఆమె ఆశ వదలలేదు. చివరికి 9వ సారి చేసిన సీపీఆర్‌తో పెద్ది సుదర్శన్ రెడ్డి గుండె మళ్లీ కొట్టుకోవడం ప్రారంభమైంది. అనంతరం మెరుగైన చికిత్స కోసం ఆయనను గ్రీన్ చానల్ ద్వారా సికింద్రాబాద్‌లోని యశోద ఆస్పత్రికి తరలించారు. అప్పటికే పెద్ది సుదర్శన్ రెడ్డి ఆరోగ్య పరిస్థితి గురించి తెలిసిన బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ వైద్యులతో, పార్టీ నాయకులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావులను వరంగల్‌కు పంపించారు. గ్రీన్ చానల్‌లో భాగంగా అంబులెన్స్ వెంట వారిద్దరు మళ్లీ యశోద దవాఖానకు వచ్చి, చికిత్సపై ఎప్పటికప్పుడు ఆరా తీశారు. కాగా, ప్రస్తుతం పెద్ది సుదర్శన్ రెడ్డి ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు యశోద ఆస్పత్రి వైద్యులు హెల్త్ బులెటిన్ విడుదల చేశారు.

**వైద్యురాలికి హరీశ్ రావు ప్రశంసలు**

పెద్ది సుదర్శన్ రెడ్డి ప్రాణాలను కాపాడిన వైద్యురాలు డాక్టర్ మమతా రెడ్డిపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు ప్రశంసల వర్షం కురిపించారు. అసాధారణమైన



## భర్త కన్నా ఎక్కువ జీతం.. భరణం ఇవ్వక్కర్లేదు!

### భార్య జీతం 8 లక్షలు
### భర్త ఉద్యోగానికి ఏఐ ముప్పు
### బాంబే హైకోర్టు కీలక తీర్పు

ముంబై: భర్త కంటే ఎక్కువ జీతం సంపాదిస్తున్న భార్యకు భరణం ఇచ్చేందుకు బాంబే హైకోర్టు నిరాకరించింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) కారణంగా భర్త ఐటీ ఉద్యోగానికి ముప్పు పొంచి ఉందని, ఈ నేపథ్యంలో భరణం మంజూరు చేయలేమని స్పష్టం చేసింది. ఈ కేసులో హైకోర్టు చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. అమెరికాలోని న్యూజెర్సీలో నివసిస్తున్న ఓ మహిళ, తన భర్త నుంచి - 2 వ పేజీలో...



## బంగారం-వెండి ధరలు

బంగారం-వెండి ధరలు (హైదరాబాద్‌లో)

| | |
|---|---|
| (గ్రాము-24 క్యారెట్స్): | రూ.14,651 |
| వెండి (కిలో): | రూ.2,45,000 |
| ప్లాటినం (గ్రాము): | రూ.5,137 |

## విశ్వవాణి



సూర్యరశ్మిని ఉపయోగించి సముద్రపు నీటిని సురక్షితమైన తాగునీటిగా మార్చడంతో పాటు విలువైన లిథియం వంటి ఖనిజాలను సేకరించే వినూత్న డీశాలినేషన్ (ఉప్పునీటి శుద్ధి) వ్యవస్థను శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. సంప్రదాయ డీశాలినేషన్ విధానాల కంటే ఈ సాంకేతికత తక్కువ వ్యయంతో, పర్యావరణానికి మరింత అనుకూలంగా ఉండే అవకాశముందని పరిశోధకులు తెలిపారు. ఈ సాంకేతికత ఇంకా ప్రయోగ దశలోనే ఉన్నప్పటికీ, భవిష్యత్తులో తీర ప్రాంతాల్లో తాగునీటి కొరతను తీర్చడంలో కీలక పాత్ర పోషించే అవకాశముంది. అదే సమయంలో విద్యుత్ వాహనాలు, ఎలక్ట్రానిక్ పరికరాల్లో ఉపయోగించే రీచార్జిబుల్ బ్యాటరీలకు అవసరమైన లిథియంను సేకరించే మార్గంగా కూడా ఇది ఉపయోగపడవచ్చని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు.



## కొమురవెల్లి రైల్వే స్టేషన్ ప్రారంభం

### ప్రారంభించిన కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్.. సికింద్రాబాద్ నుంచి టికెట్ ధర రూ.25

కొమురవెల్లి-సిద్దిపేట, జూలై 26 (ఈవార్తలు): సిద్దిపేట జిల్లాలోని కొమురవెల్లి పుణ్యక్షేత్రం రైల్వే స్టేషన్ ప్రారంభం అయింది. కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి.. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కొమురవెల్లి పుణ్యక్షేత్రం రైల్వే స్టేషన్‌ను ఆదివారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, ఎంపీలు మాధవ నేని రఘునందన్ రావు, చామల కిరణ్ కుమార్ రెడ్డి, రాజ్యసభ సభ్యుడు తరువాయి 2 వ పేజీలో...

# జై జవాన్.. జై కిసాన్.. జై యువ



### 21 ఏళ్లకే ఎమ్మెల్యే, ఎంపీగా చాన్స్.. కేంద్రానికి సీఎం రేవంత్ ప్రతిపాదన

### ఓ చానల్ ఇంటర్వ్యూలో కీలక వ్యాఖ్యలు.. అసెంబ్లీలో తీర్మానం చేస్తామని వెల్లడి

యువతను చట్టసభల్లోకి పెద్ద ఎత్తున తీసుకురావాలనే లక్ష్యంతో, శాసనసభ, లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసే కనీస వయోపరిమితిని 25 ఏళ్ల నుంచి 21 ఏళ్లకు తగ్గించాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 21 ఏళ్లకే యువత సివిల్ సర్వెంట్లుగా, మేయర్లుగా బాధ్యతలు చేపడుతున్నప్పుడు, వారికి చట్టసభల్లో పోటీ చేసే అవకాశం ఎందుకు ఇవ్వకూడదని ఆయన ప్రశ్నించారు. ఓ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో రేవంత్ రెడ్డి ఈ విషయాలు వెల్లడించారు.

హైదరాబాద్, జూలై 26 (ఈవార్తలు): "21 ఏళ్లకే ఐఏఎస్, ఐపీఎస్ అధికారులుగా, జిల్లా పంచాయతీ చైర్‌పర్సన్‌లుగా నియమిస్తున్నాం. అలాంటప్పుడు అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో పోటీకి ఎందుకు అనుమతించకూడదు? దేశ జనాభాలో దాదాపు 30 శాతం ఉన్న 'జెన్-జీ' తరం గొంతుక చట్టసభల్లో వినిపించాలి. వారికి ఎమ్మెల్యేలుగా, ఎంపీలుగా, మంత్రులుగా పనిచేసే అవకాశాలు రావాలి" అని ఆయన అభిప్రాయపడ్డారు. నియోజకవర్గాల పునర్విభజన, పార్లమెంట్ సీట్ల పెంపు, మహిళా రిజర్వేషన్ వంటి అంశాలతో పాటు ఎన్నికల్లో పోటీ చేసే తరువాయి 2 వ పేజీలో...



## కేంద్ర విద్యాశాఖ మంత్రిగా ప్రహ్లాద్ జోషి బాధ్యతలు

న్యూఢిల్లీ: కేంద్ర విద్యాశాఖ నూతన మంత్రిగా సీనియర్ నేత ప్రహ్లాద్ జోషి ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. దేశవ్యాప్తంగా విద్యార్థుల ఆందోళనల నేపథ్యంలో ధర్మేంద్ర ప్రధాన్ శనివారం కేంద్ర విద్యాశాఖ మంత్రి పదవికి రాజీనామా చేయడం తెలిసిందే. ఈ క్రమంలో, కొత్త విద్యాశాఖమంత్రిగా జోషికి అదనపు బాధ్యతలు అప్పగించారు. తరువాయి 2 వ పేజీలో...

## ఈతకు వెళ్లి నలుగురు మృతి

### నిజామాబాద్ జిల్లా శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో విషాదం.. ముప్కాల్ వద్ద బ్యాక్‌వాటర్ వద్ద ఘటన



నిజామాబాద్ జిల్లాలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు (ఎస్ఆర్ఎస్ పీ) బ్యాక్‌వాటర్‌లో ఈతకు వెళ్లిన నలుగురు యువకులు నీట మునిగి మృతి చెందారు. వీరితో పాటు వెళ్లిన మరో యువకుడు సురక్షితంగా ఒడ్డుకు చేరుకోవడంతో ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే, ముప్కాల్ సమీపంలోని శ్రీరాంసాగర్ ప్రాజెక్టు వెనుక జలాల్లోకి ఐదుగురు యువకులు ఆదివారం సాయంత్రం ఈతకు వెళ్లారు.

నిజామాబాద్, జూలై 26 (ఈవార్తలు): నీటి లోతును అంచనా వేయలేకపోవడంతో నలుగురు గల్లంతయ్యారు. వారిలో ఒకరు ప్రాణాలతో బయటపడి ఒడ్డుకు చేరుకున్నారు. అతని సమాచారంతో స్థానికులు వెంటనే స్పందించి గాలింపు చేపట్టారు. కొద్దిసేపటికే నలుగురి మృతదేహాలను స్థానికులు వెలికితీశారు. సమాచారం అందుకున్న పోలీసులు -2 వ పేజీలో...




## టీమిండియా క్లీన్ స్వీప్

### మూడో టీ20 కూడా మనదే
### జింబాబ్వేపై సూపర్ విక్టరీ

# రాశి ఫలాలు

26.7.2026

**మేషం :** ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తే ఆశించిన విజయాలు సొంతం అవుతాయి. వృత్తి, ఉద్యోగ రంగాల్లో కొత్త అవకాశాలు లభిస్తాయి. ఉన్నతాధికారుల నుంచి ప్రశంసలు అందుకుంటారు. మీ పట్ల గౌరవం పెరుగుతుంది. మీ ప్రతిష్ఠ, ప్రభావం మరింత వృద్ధి చెందుతాయి. గణనాయకాష్టకం పఠించడం శ్రేయస్కరం.

**వృషభం :** ఉద్యోగ, వ్యాపార రంగాల్లో అనుకూల పరిస్థితులు ఏర్పడతాయి. ఉత్సాహంతో ప్రారంభించిన పనులు విజయవంతంగా పూర్తవుతాయి. స్నేహితులు, బంధువులతో ఆనందంగా గడుపుతారు. ఒక శుభవార్త మనసుకు ఉత్సాహాన్ని కలిగిస్తుంది. శ్రీఆంజనేయ స్వామి ఆరాధన శుభప్రదం.

**మిథునం :** ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగి అనుకున్న లక్ష్యాలను చేరుకుంటారు. అవసరమైన సమయంలో తగిన సహకారం లభిస్తుంది. బంధుమిత్రులతో అనుబంధం మరింత బలపడుతుంది. ప్రారంభించిన పనుల్లో సంతృప్తికరమైన ఫలితాలు పొందుతారు. ఇష్టదైవ ఆరాధన శుభప్రదం.

**కర్కాటకం :** కొన్ని ఆటంకాలు ఎదురైనప్పటికీ ధైర్యం, పట్టుదలతో వాటిని అధిగమిస్తారు. ప్రతికూల పరిస్థితులు క్రమేణా మీకు అనుకూలంగా మారుతాయి. బంధాలను మరింత బలోపేతం చేసుకునే అవకాశం లభిస్తుంది. మాటల్లో సంయమనం పాటించడం మేలు చేస్తుంది. శ్రీలక్ష్మీ స్తోత్రం పఠించడం మంగళప్రదం.

**సింహం :** మిశ్రమ పరిస్థితులు ఎదురైనప్పటికీ సమయోచితంగా వ్యవహరిస్తే మంచి ఫలితాలు పొందుతారు. పనిభారం పెరిగే అవకాశం ఉన్నందున విశ్రాంతికి కూడా ప్రాధాన్యం ఇవ్వాలి. కుటుంబ సభ్యుల సూచనలు ఉపయోగపడతాయి. అనవసర విభేదాలకు దూరంగా ఉండండి. దుర్గాదేవి ధ్యానం శాంతిని ప్రసాదిస్తుంది.

**కన్య :** పెద్దల ఆశీర్వాదం, సహకారం లభిస్తుంది. కొన్ని ఆటంకాలు ఎదురైనప్పటికీ పట్టుదలతో ముందుకు సాగి విజయం సాధిస్తారు. ఖర్చుల విషయంలో మితవ్యయం పాటించడం మంచిది. చిన్నచిన్న విషయాలను మనసుకు తీసుకోకుండా ప్రశాంతంగా ఉండాలి. హనుమాన్ చాలీసా పఠించడం శ్రేయస్కరం.

**తుల :** అదృష్టం మీకు అనేక విధాలుగా కలిసి వస్తుంది. కృషికి తగిన గుర్తింపు, ప్రశంసలు లభిస్తాయి. ధైర్యంగా తీసుకునే నిర్ణయాలు విజయానికి దారితీస్తాయి. మీ ప్రతిభకు అందరి నుంచి ప్రశంసలు లభిస్తాయి. శివారాధన మంగళప్రదం.

**వృశ్చికం :** పట్టుదలతో ప్రారంభించిన పనులు విజయవంతంగా పూర్తవుతాయి. శుభకార్యక్రమాల్లో పాల్గొని ఆనందాన్ని పొందుతారు. కుటుంబంలో చిన్నచిన్న భేదాభిప్రాయాలు వచ్చినప్పటికీ సహనంతో వాటిని పరిష్కరించగలుగుతారు. దక్షిణామూర్తి స్తోత్రం పఠించడం శుభప్రదం.


**ధనుస్సు :** శుభఫలితాలు అందించే సమయం. మీ తెలివితేటలు, చాతుర్యం అందరినీ ఆకట్టుకుంటాయి. కుటుంబాభివృద్ధికి సంబంధించిన ఆనందకరమైన వార్త వింటారు. ఉత్సాహంగా, ఆత్మవిశ్వాసంతో కార్యక్రమాలను పూర్తి చేస్తారు. ఇష్టదైవ ఆరాధన శ్రేయస్సును ప్రసాదిస్తుంది.

**మకరం :** అవసరమైన సమయంలో సహాయం అందుతుంది. బంధుమిత్రుల సూచనలను గౌరవిస్తే ప్రయోజనం పొందుతారు. ప్రణాళికాబద్ధంగా ఖర్చులు చేస్తే ఆర్థికంగా స్థిరత్వం ఉంటుంది. పనుల మధ్య విశ్రాంతికి సమయం కేటాయించడం మంచిది. శివారాధన శాంతిని ప్రసాదిస్తుంది.

**కుంభం :** పట్టుదలతో ప్రారంభించిన పనులు పూర్తవుతాయి. మీ బుద్ధిబలం, సమయస్ఫూర్తి మంచి ఫలితాలను అందిస్తాయి. చిన్నచిన్న సమస్యలు ఎదురైనప్పటికీ వాటిని సులభంగా పరిష్కరించగలుగుతారు. కొత్త అవకాశాలు మీకు అనుకూలంగా మారుతాయి. శని శ్లోకం పఠించడం మంగళప్రదం.

**మీనం :** అనుకూల పరిస్థితులు ఏర్పడి మనఃశ్శాంతి, సంతోషం లభిస్తాయి. వృత్తి, వ్యాపార రంగాల్లో లాభదాయకమైన అవకాశాలు కనిపిస్తాయి. కుటుంబ సభ్యులతో ఆనందంగా సమయం గడుపుతారు. ప్రారంభించిన పనులు సానుకూలంగా పూర్తవుతాయి. గణపతి ఆరాధన శుభఫలితాలను అందిస్తుంది.

# యువశక్తే.. సలాం!



మొదటి పేజీ తరువాయి

ప్రదర్శన కనబరిచారని చెప్పారు. ఈ నెలలో జరిగిన ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ, మ్యాథమెటిక్స్ ఒలింపియాడ్స్‌లో మన విద్యార్థులు సత్తా చాటారని తెలిపారు. ఫిజిక్స్ ఒలింపియాడ్స్‌లో మన ఐదుగురు విద్యార్థులు స్వర్ణ పతకాలు సాధించారని, దీంతో భారత్ మొదటి స్థానంలో నిలిచిందని మోదీ హర్షం వ్యక్తం చేశారు. గత పదేళ్లుగా ఫిజిక్స్ ఒలింపియాడ్స్‌లో భారత విద్యార్థులు స్వర్ణ లేదా రజత పతకాలు సాధిస్తూ వస్తున్నారని గుర్తుచేశారు. కెమిస్ట్రీ ఒలింపియాడ్స్‌లో పాల్గొన్న విద్యార్థులందరూ స్వర్ణ పతకాలు గెలుచుకున్నారని, ఇది ఇప్పటివరకు అత్యుత్తమ ప్రదర్శన అని పేర్కొన్నారు. అలాగే, బయాలజీ ఒలింపియాడ్స్‌లో స్వర్ణంతో సహా పలు పతకాలు, మ్యాథమెటిక్స్ ఒలింపియాడ్స్‌లో రెండు స్వర్ణాలు, నాలుగు రజతాలు సాధించారని వివరించారు. దేశ యువశక్తిని చూసి తాను ఎంతో గర్వపడుతున్నానని అన్నారు. భవిష్యత్తులో మరింత మంది యువత ఇలాంటి ఒలింపియాడ్స్, హ్యాకథాన్లలో పాల్గొని దేశానికి గర్వకారణంగా నిలుస్తారన్న విశ్వాసాన్ని ఆయన వ్యక్తం చేశారు.

**పరీక్షల సంస్కరణలకు టాస్క్‌ఫోర్స్**

దేశవ్యాప్తంగా పరీక్షల నిర్వహణలో ఎదురవుతున్న సమస్యలు, పేపర్ లీక్‌ల ఆరోపణల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఒక కీలక నిర్ణయం తీసుకుంది. పరీక్షల సంస్కరణల కోసం ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు, ఆధార్ రూపశిల్పిగా పేరుగాంచిన నందన్ నీలేకని నేతృత్వంలో ఒక హైపవర్డ్ టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆదివారం ప్రకటించారు. ఈ టాస్క్‌ఫోర్స్ ఇచ్చే నివేదిక ఆధారంగా, భవిష్యత్తులో జరిగే పరీక్షల విశ్వసనీయతను కాపాడేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ ఒక వీడియో సందేశాన్ని విడుదల చేశారు. “విద్యార్థుల భవిష్యత్తు కోసం భారత ప్రభుత్వం నిరంతరం అనేక చర్యలు తీసుకుంటోంది. వారి భవిష్యత్తుతో చెలగాటమాడిన వారు ఇప్పటికే జైళ్లలో మగ్గుతున్నారు. ఫాస్ట్-ట్రాక్ కోర్టులను కూడా ఏర్పాటు చేశాం. కఠినమైన చట్టపరమైన నిబంధనలతో కొత్త చట్టాన్ని పార్లమెంటులో తీసుకురావడానికి కూడా సిద్ధమవుతున్నాం. అయితే, మనం భవిష్యత్తును కూడా చూడాలి. మన పరీక్షా వ్యవస్థ విశ్వసనీయంగా, పారదర్శకంగా ఉండాలి. సాంకేతికతను గరిష్ఠంగా వినియోగించుకోవాలి. ఈ అంశాలన్నింటినీ దృష్టిలో ఉంచుకుని, ప్రపంచ ప్రఖ్యాత టెక్నాలజీ నిపుణుడు నందన్ నీలేకని నాయకత్వంలో హైపవర్డ్ టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించాం” అని వివరించారు. ఈ టాస్క్‌ఫోర్స్‌లో నీలేకనితో పాటు ఇస్రో మాజీ ఛైర్మన్ ఎస్. సోమనాథ్, ఐబీ మాజీ డైరెక్టర్ తపన్ డేకా, ఐఐటీ చెన్నై డైరెక్టర్ వి. కామకోటి, మాజీ విద్యాశాఖ కార్యదర్శి అనితా కర్వాల్, లాజిస్టిక్స్ నిపుణుడు అమృత్ లాల్ మీనా వంటి ప్రముఖులు సభ్యులుగా ఉంటారని అధికారిక ప్రకటన వెలువడింది. ఈ కమిటీ పరీక్షల సంస్కరణలపై దృష్టి సారించి, వీలైనంత త్వరగా నివేదిక సమర్పిస్తుందని ప్రధాని తెలిపారు. దేశవ్యాప్తంగా వివిధ పోటీ పరీక్షల్లో అవకతవకలు జరిగాయని, పేపర్లు లీక్ అయ్యాయని ఆరోపిస్తూ విద్యార్థులు పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టిన విషయం తెలిసిందే. ఈ నిరసనల కారణంగా తీవ్ర ఒత్తిడి ఎదుర్కొన్న కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేశారు. ఆయన స్థానంలో, ప్రస్తుతం కేంద్ర ఆహార, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రిగా ఉన్న ప్రహ్లాద్ జోషికి విద్యాశాఖ అదనపు బాధ్యతలను అప్పగించారు. ఆదివారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతను అప్పగించిన ప్రధాని మోదీకి కృతజ్ఞతలు తెలిపారు. వినయంతో, పూర్తి బాధ్యతాయుతంగా ఈ విధులను నిర్వర్తిస్తానని సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ‘ఎక్స్’ లో పోస్ట్ చేశారు. తీవ్రమైన ఆరోపణలు, విద్యార్థుల ఆందోళనలతో విద్యాశాఖ గడ్డు కాలాన్ని ఎదుర్కొంటున్న తరుణంలో ప్రహ్లాద్ జోషి నియామకం ప్రాధాన్యత సంతరించుకుంది.

## జై జవాన్.. జై కిసాన్.. జై యువ

మొదటి పేజీ తరువాయి

కనిష్ఠ వయోపరిమితి తగ్గింపు అంశాన్ని కూడా కేంద్ర ప్రభుత్వం పరిశీలించాలని ముఖ్యమంత్రి సూచించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో యువత పాత్రను మరింత విస్తరించడం దేశ భవిష్యత్తుకు అవసరమని తెలిపారు. ఈ అంశంపై ఆగస్టు మొదటి వారంలో రాష్ట్ర శాసనసభ, మండలి ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి, వయోపరిమితి తగ్గింపు కోరుతూ ఒక తీర్మానాన్ని ఆమోదించి కేంద్రానికి పంపిస్తామని సీఎం ప్రకటించారు. గతంలో రాజీవ్ గాంధీ ఓటు హక్కు వయసును 21 నుంచి 18 ఏళ్లకు తగ్గించారని, ఇప్పుడు ఎన్నికల్లో పోటీ చేసే వయసును తగ్గించాల్సిన సమయం ఆసన్నమైందని ఆయన గుర్తుచేశారు. ఇదే సందర్భంగా తెలంగాణ అభివృద్ధిపైనా రేవంత్ మాట్లాడారు. రీజనల్ రింగ్ రోడ్, మెట్రో రైల్, మూసీ నది అభివృద్ధి వంటి ప్రాజెక్టులపై తుది నిర్ణయాలు రావాల్సి ఉందని తెలిపారు. “ప్రధాని మోదీ ఈ దేశానికి ప్రధాని. ఆయన గుజరాత్‌ను, తెలంగాణను వేర్వేరుగా చూడకూడదు. గుజరాత్ తరహాలోనే తెలంగాణ అభివృద్ధికి కేంద్రం సహకరించాలి. వికసిత భారత్ లక్ష్యంలో తెలంగాణ 10 శాతం వాటా అందించాలని కోరుకుంటున్నాను” అని పేర్కొన్నారు.

## ఈతకు వెళ్లి నలుగురు మృతి

మొదటి పేజీ తరువాయి

ఘటనా స్థలానికి చేరుకుని విచారణ ప్రారంభించారు. మృతుల్లో ముగ్గురు నిజామాబాద్ పట్టణానికి చెందిన వారిగా ప్రాథమికంగా గుర్తించారు. ఈ ఘటనతో స్థానికంగా విషాద ఛాయలు అలుముకున్నాయి. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ప్రశాంతంగా నిద్రపోయా: అభిజీత్ దీప్కే

‘37 రోజుల తర్వాత ఈ రోజు ప్రశాంతంగా నిద్రపోయాను. రేపు ఏం చేయాలి, సాయంత్రానికి ఏం జరుగుతుందోనన్న ఆందోళన లేకుండా నా బెడ్‌రూమ్‌లో మేల్కొన్నాను. ఇప్పుడు ఎలాంటి భయం లేదు’ అని ఆదివారం ఉదయం ఎక్స్‌లో అభిజీత్ దీప్కే పోస్ట్ చేశారు. ఈ 37 రోజుల పోరాటం అత్యంత కఠినంగా గడిచిందని ఆయన గుర్తుచేసుకున్నారు. ఈ విజయం తర్వాత తమ పార్టీ ప్రయాణం ఇక్కడితో ఆగదని, ఇది కేవలం ఆరంభం మాత్రమేనని అభిజీత్ స్పష్టం చేశారు. “కాక్రోచ్ జనతా పార్టీ ఇంకా సుదీర్ఘ ప్రయాణం చేయాల్సి ఉంది” అని ఆయన పేర్కొన్నారు. తమ నిరసనపై ఎన్నో అనుమానాలు వ్యక్తమైనప్పటికీ, తమకు మద్దతుగా నిలిచిన ప్రతి ఒక్కరికీ ఆయన ధన్యవాదాలు తెలిపారు. టైఫాయిడ్ జ్వరంతో బాధపడుతున్నందున, నిన్న జంతర్ మంతర్ వద్ద అందరికీ వ్యక్తిగతంగా కృతజ్ఞతలు చెప్పలేకపోయినందుకు క్షమాపణలు కోరారు. ‘ఈ దేశం కోసం మీరు చేసిన పోరాటాన్ని నేను ఎప్పటికీ అభినందిస్తాను’ అని మద్దతుదారులను ఉద్దేశించి అన్నారు. అదే సమయంలో తమను విమర్శించిన వారికి కూడా ఆయన కృతజ్ఞతలు చెప్పడం విశేషం. ‘వారు అడిగిన సరైన ప్రశ్నలు, చేసిన విమర్శల వల్లే మేం మరింత మెరుగుపడి మంచి ఫలితాలు సాధించగలిగాం’ అని అభిజీత్ అభిప్రాయపడ్డారు.

## ‘పెద్ది’కి పునర్జన్మ

మొదటి పేజీ తరువాయి

అంకితభావంతో, అవిశ్రాంతంగా శ్రమించి పెద్ది ప్రాణాలను కాపాడిన డాక్టర్ మమతా రెడ్డికి హరీష్ రావు.. ఎక్స్ వేదికగా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. అత్యంత ఒత్తిడిలోనూ డాక్టర్ మమతా రెడ్డి అసాధారణ నైపుణ్యం, ధైర్యం, నిబద్ధత ప్రదర్శించారని కొనియాడారు. ఆమె సేవలు వైద్య వృత్తి గొప్పతనాన్ని మరోసారి చాటిచెప్పాయని.. ఇలాంటి డాక్టర్లు సమాజానికి స్ఫూర్తిగా నిలుస్తారని పేర్కొన్నారు. ఈ క్రమంలోనే పెద్ది అన్న త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఇక హార్ట్ స్ట్రోక్ వల్ల పెద్ది సుదర్శన్ రెడ్డి శరీరంలోని అవయవాలపై ప్రభావం పడిందని బీఆర్ఎస్ వర్గాలు వెల్లడించాయి. ఈ నేపథ్యంలోనే ఆయన 72 గంటలు పూర్తిగా డాక్టర్ల అబ్జర్వేషన్లో ఉండాలని పేర్కొన్నాయి. ఆ తర్వాత డిశ్చార్జ్ అయ్యే అవకాశాలు ఉన్నాయని తెలిపాయి.

## కేంద్ర విద్యాశాఖ మంత్రిగా ప్రహ్లాద్ జోషి బాధ్యతలు

మొదటి పేజీ తరువాయి

నీట్ పేపర్ లీక్ నేపథ్యంలో, 36 రోజులుగా ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద విద్యార్థుల నిరసనలతో ఉద్రిక్తతలు నెలకొన్నాయి. ఈ పరిస్థితుల దృష్ట్యా, తాను ప్రధాని నరేంద్ర మోదీకి రాజీనామా సమర్పించినట్లు ధర్మేంద్ర ప్రధాన్ ‘ఎక్స్’ వేదికగా శనివారం ప్రకటించారు. ఆయన రాజీనామా చేసిన కాసేపట్లోనే ప్రహ్లాద్ జోషికి ఈ కీలక శాఖను అప్పగించారు. ఆదివారం బాధ్యతలు స్వీకరించిన అనంతరం ప్రహ్లాద్ జోషి సోషల్ మీడియాలో స్పందించారు. “కేంద్ర విద్యాశాఖ మంత్రిగా ఈరోజు బాధ్యతలు స్వీకరించాను. నాపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతను అప్పగించిన ప్రధాని నరేంద్ర మోదీకి కృతజ్ఞతలు. వినయంతో, కర్తవ్య నిష్ఠతో ఈ బాధ్యతను స్వీకరిస్తున్నాను” అని పేర్కొన్నారు. కర్ణాటకకు చెందిన ప్రహ్లాద్ జోషి, ధార్వాడ్ లోక్‌సభ స్థానం నుంచి ఐదుసార్లు ఎంపీగా గెలుపొందారు. గతంలో పార్లమెంటరీ వ్యవహారాలు, బొగ్గు, గనుల శాఖల మంత్రిగా పనిచేశారు. 2024 ఎన్నికల అనంతరం వినియోగదారుల వ్యవహారాలు, పునరుత్పాదక ఇంధన శాఖలను నిర్వహించారు.

## భర్త కన్నా ఎక్కువ జీతం.. భరణం ఇవ్వక్కర్లేదు!

మొదటి పేజీ తరువాయి

భరణం ఇప్పించాలని కోర్టును ఆశ్రయించారు. ఆమె న్యూఢిల్లీకి చెందిన ఓ ఐటీ సంస్థలో పనిచేస్తూ నెలకు 8 లక్షల రూపాయలు (8,700 డాలర్లు) సంపాదిస్తున్నారు. ఆమె భర్త కూడా ఐటీ రంగంలోనే పనిచేస్తున్నారు. అయితే, తన భర్త జీతం కన్నా తన సంపాదన ఎక్కువగా ఉన్నప్పటికీ, విదేశాల్లో జీవన వ్యయం అధికంగా ఉందని, అందువల్ల భరణం కింద నెలకు లక్ష రూపాయలు ఇప్పించాలని ఆమె కోరారు. ఈ పిటిషన్‌ను జస్టిస్ భారతీ డాంగ్రే, జస్టిస్ మంజుషా దేశ్‌పాండేలతో కూడిన ధర్మాసనం విచారించింది. విదేశాల్లో జీవన వ్యయం ఎక్కువగా ఉందనే కారణంతో భరణం కోరడం సరికాదని కోర్టు అభిప్రాయపడింది. అదే సమయంలో, ఐటీ రంగంలో పెరుగుతున్న పోటీ, ఏఐ వాడకం వల్ల భర్త ఉద్యోగానికే ప్రమాదం పొంచి ఉందని ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ కారణాలతో ఆమె పిటిషన్‌ను కొట్టివేసింది. ఇదే కేసులో గతంలో ఫ్యామిలీ కోర్టు కూడా ఆమె భరణం అభ్యర్థనను తిరస్కరించింది. అయితే, కేసు విచారణ ఖర్చుల కింద రూ. 25,000 చెల్లించాలని భర్తను ఆదేశించింది. ఫ్యామిలీ కోర్టు తీర్పును సవాలు చేస్తూ సదరు మహిళ హైకోర్టును ఆశ్రయించగా, అక్కడ కూడా ఆమెకు చుక్కెదురైంది.




# కొమురవెల్లి రైల్వే స్టేషన్ ప్రారంభం

మొదటి పేజీ తరువాయి

కే లక్ష్మణ్, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు. కొమురవెల్లి రైల్వే స్టేషన్ ప్రారంభోత్సవం తర్వాత.. కేంద్రమంత్రులు, ఎంపీలు కలిసి కొమురవెల్లి పుణ్యక్షేత్రం స్టేషన్ నుంచి సిద్దిపేట-సికింద్రాబాద్ డెమూ రైలు నంబర్ 77654ను జెండా ఊపి ప్రారంభించారు. ఆ తర్వాత అదే రైలులో సికింద్రాబాద్‌కు ప్రయాణం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన కేంద్రమంత్రి కిషన్ రెడ్డి.. కొమురవెల్లి పుణ్యక్షేత్రంలో రైల్వే స్టేషన్ ప్రారంభం చారిత్రాత్మక ఘట్టమని పేర్కొన్నారు. హైదరాబాద్‌తో పాటు రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల నుంచి కొమురవెల్లి మల్లన్న స్వామి దర్శనానికి వచ్చే భక్తులకు ఈ రైల్వే స్టేషన్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని చెప్పారు.

కొమురవెల్లి మల్లన్న ఆలయం హైదరాబాద్‌కు సుమారు 85 కిలోమీటర్ల దూరంలో ఉండగా.. ఇప్పటి వరకు భక్తులు బస్సులు, ఆటోలు మార్చుకుంటూ ఎన్నో వ్యయప్రయాసలకు ఓర్చి ఆలయానికి చేరుకోవాల్సి వచ్చేది. కొత్త రైల్వే స్టేషన్ ప్రారంభంతో మల్లన్న క్షేత్రానికి మరింత సులభతరంగా ప్రయాణం కానుందని పేర్కొన్నారు. రైల్వే స్టేషన్ నుంచి ఆలయం కేవలం 3 కిలోమీటర్ల దూరంలో ఉండటంతో భక్తులు తక్కువ ఖర్చుతో, తక్కువ సమయంలో ఆలయానికి చేరుకునే అవకాశం లభిస్తుంది. రూ.6 కోట్ల వ్యయంతో అభివృద్ధి చేసిన ఈ రైల్వే స్టేషన్ లకుడారం, దుద్దెడ స్టేషన్ల మధ్య నిర్మించారు. సికింద్రాబాద్-సిద్దిపేట మార్గంలో నడిచే 4 డెమూ రైళ్లకు రెండు అప్, రెండు డౌన్ ఇక్కడ హాల్ట్ కల్పించారు. సికింద్రాబాద్ నుంచి కొమురవెల్లి వరకు టికెట్ ధర రూ.25 కాగా.. సిద్దిపేట నుంచి రూ.10గా నిర్ణయించారు. ఈ స్టేషన్ ద్వారా భక్తులతో పాటు స్థానిక విద్యార్థులు, ఉద్యోగులు, చిరువ్యాపారులు కూడా ప్రయోజనం పొందనున్నారు. కొమురవెల్లి ప్రాంత రవాణా సౌకర్యాల మెరుగుదలకు ఇది కీలక అడుగుగా నిలవనుందని అధికారులు అభిప్రాయపడుతున్నారు.



## రోడ్డు ప్రమాదంలో ఇద్దరి దుర్మరణం

కూకట్‌పల్లి-హైదరాబాద్, జూలై 26 (ఈవార్తలు): హైదరాబాద్‌లోని కూకట్‌పల్లిలో ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. ఆదివారం తెల్లవారుజామున చోటుచేసుకున్న ఈ దుర్ఘటనలో ఇద్దరు యువకులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. అతివేగంతో వచ్చిన టిప్పర్ లారీ స్కూటీని బలంగా ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. వివరాల్లోకి వెళితే.. మహేశ్ (17), లక్ష్మీ తేజ (17) మరో స్నేహితుడితో కలిసి క్రికెట్ ఆడేందుకు ఒకే స్కూటీపై వెళ్తున్నారు. కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోకి చేరుకోగానే, వెనుక నుంచి అతివేగంగా వచ్చిన టిప్పర్ వారి వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మహేశ్, లక్ష్మీ తేజల తలలకు తీవ్ర గాయాలు కావడంతో వారు అక్కడికక్కడే మృతి చెందారు. వీరితో పాటు ఉన్న మరో యువకుడికి తీవ్ర గాయాలవ్వగా, చికిత్స నిమిత్తం హుటాహుటిన సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న వెంటనే కూకట్‌పల్లి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన టిప్పర్ డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. డ్రైవర్ నిర్లక్ష్యం, అతివేగమే ప్రమాదానికి కారణమా అనే కోణంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ దుర్ఘటనతో మృతుల కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది.

## కాపులతోనే అధికారం
## ఏపీ టీడీపీ ఎమ్మెల్యే బొండా ఉమా

విజయవాడ, జూలై 26 (ఈవార్తలు): రాష్ట్ర జనాభాలో కోటి మందికి పైగా ఉన్న కాపు, బలిజ, తూర్పు కాపు సామాజికవర్గాలు ఏ పార్టీ వైపు మొగ్గుచూపితే ఆ పార్టీనే అధికారంలోకి వస్తుందని ఏపీలోని విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు అభిప్రాయపడ్డారు. శనివారం గుంటూరులో రాష్ట్ర కాపు జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించిన ముద్రగడ సంస్మరణ సభలో ఆయన పాల్గొని కీలక వ్యాఖ్యలు చేశారు. మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం నేతృత్వంలో సాగిన కాపు ఉద్యమం కారణంగానే 2019 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అధికారానికి దూరమైందని ఆయన పేర్కొన్నారు. నాడు జరిగిన కొన్ని వ్యతిరేక ప్రచారాల వల్ల ముద్రగడ ప్రారంభించిన ఉద్యమం టీడీపీ ఓటమికి దారితీసిందని విశ్లేషించారు. రాష్ట్ర జనాభాలో 25 శాతం ఉన్న కాపులకు జనాభా దామాషా ప్రకారం నిధులు, పదవులు కేటాయించాలన్నది సమంజసమైన ఆకాంక్ష అని, వారిలో ఉన్న అసంతృప్తిని ప్రభుత్వం గుర్తించాలని సూచించారు. త్వరలోనే విజయవాడలో ముద్రగడ పద్మనాభం విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నట్లు ఈ సందర్భంగా ఆయన ప్రకటించారు. ఇదే కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ.. ముద్రగడ మాటకు కట్టుబడే వ్యక్తి అని కొనియాడారు. ఇచ్చిన మాట కోసం తన పేరునే మార్చుకున్న గొప్ప వ్యక్తి అని ఆయన గుర్తుచేశారు. ఒకే సామాజికవర్గానికి చెందిన ఇద్దరు ప్రత్యర్థి పార్టీల నేతలు బొండా ఉమ, అంబటి రాంబాబు ఒకే వేదికపై పక్కపక్కనే కూర్చొని ఆప్యాయంగా మాట్లాడుకోవడం ఈ సభలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు లింగంశెట్టి ఈశ్వరరావు, కిలారి రోశయ్య తదితరులు పాల్గొన్నారు.

## బోండా ఉమ నుంచి సంజాయిషీ

**అంబటి రాంబాబుతో వేదిక పంచుకున్న బొండా ఉమ**

**తీవ్రంగా స్పందించిన ఏపీ సీఎం చంద్రబాబు**

**బొండా ఉమ నుంచి వివరణ తీసుకోవాలని నిర్ణయం**

విజయవాడ, జూలై 26 (ఈవార్తలు): తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బొండా ఉమామహేశ్వరరావు వ్యవహారంపై ముఖ్యమంత్రి, టీడీపీ జాతీయ అధినేత చంద్రబాబు తీవ్రంగా స్పందించారు. గుంటూరులో జరిగిన ఓ కార్యక్రమంలో వైసీపీ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబుతో కలిసి వేదిక పంచుకోవడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో బొండా ఉమ నుంచి తక్షణమే సంజాయిషీ తీసుకోవాలని చంద్రబాబు కీలక నిర్ణయం తీసుకున్నారు. ఆయన నుంచి వివరణ స్వీకరించే బాధ్యతను టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, మంత్రి నిమ్మల రామానాయుడులకు అప్పగించారు. వివరాల్లోకి వెళితే, ఇటీవల గుంటూరులో కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం సంతాప సభ జరిగింది. ఈ కార్యక్రమానికి బొండా ఉమ, అంబటి రాంబాబు హాజరయ్యారు. ఇద్దరూ ఒకే వేదికపై ఆశీనులవడమే కాకుండా, ఆప్యాయంగా మాట్లాడుకున్నారు. ఇందుకు సంబంధించిన వీడియోలు, ఫొటోలు సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం కావడంతో రాజకీయ వర్గాల్లో చర్చ మొదలైంది. నిత్యం చంద్రబాబును, టీడీపీ ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శించే అంబటితో బొండా ఉమ వేదిక పంచుకోవడంపై సొంత పార్టీ శ్రేణుల నుంచే అసంతృప్తి వ్యక్తమైంది. ఈ పరిణామంపై పార్టీ నేతలతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో చంద్రబాబు తీవ్ర స్వరంతో స్పందించారు. వైసీపీని 'గొడ్డలి పార్టీ' అని, 'విషవృక్షం' అని అభివర్ణించిన ఆయన, ఆ పార్టీతో ఎలాంటి సంబంధాలు పెట్టుకోవద్దని స్పష్టం చేశారు. "కులాలు, మతాల మధ్య చిచ్చుపెట్టి, ప్రజలను విడదీయడమే వైసీపీ ఎజెండా. ఆ పార్టీ పన్నే ఉచ్చులో ఎవరూ పడొద్దు. భవిష్యత్తులో ఎలాంటి పరిస్థితుల్లోనూ వైసీపీ నేతలతో మన పార్టీ నాయకులు వేదిక పంచుకోకూడదు. ఈ విషయాన్ని ప్రతీ ఒక్కరూ గుర్తుంచుకోవాలి" అని గట్టిగా హెచ్చరించారు.

## ఆర్కే రోజాకు నోటీసులు



చిత్తూరు, జూలై 26 (ఈవార్తలు): మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ నేత ఆర్కే రోజాకు తిరుపతి ఈస్ట్ పోలీసులు నోటీసులు జారీ చేశారు. చిత్తూరు జిల్లా నగరిలో రోజాకు ఈ నోటీసులు అందజేసిన పోలీసులు.. ఈ నెల 30వ తేదీన విచారణకు హాజరుకావాలని అందులో ఆదేశించారు. మహిళలపై అవాస్తవ కథనాలు రాసిన పత్రిక ప్రతులను దహనం చేస్తూ నిరసన తెలిపినందుకు తనపై కేసు నమోదు చేశారని రోజా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం రాజకీయ కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే ఈ అక్రమ కేసు బనాయించిందని ఆమె ఆరోపించారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు ప్రతి ఒక్కరికీ ఉంటుందని, ప్రశ్నించే వారి గొంతు నొక్కేందుకే ప్రభుత్వం ఇలాంటి వేధింపులకు పాల్పడుతోందని రోజా మండిపడ్డారు. బెదిరింపులకు, అక్రమ కేసులకు తాను భయపడేది లేదని.. ప్రజల పక్షాన తన పోరాటం కొనసాగుతుందని ఆమె స్పష్టం చేశారు. మరోవైపు, వైఎస్సార్‌సీపీ నేతలపై కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలు కొనసాగిస్తోందని ఆ పార్టీ వర్గాలు తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పిస్తున్నాయి.

# ఆగస్టు 1 నుంచి రేషన్ స్మార్ట్ కార్డులు

**ఈ-కేవైసీ చేయించుకోనివారికి కట్**




హైదరాబాద్, జూలై 26 (ఈవార్తలు): తెలంగాణలోని తెల్ల రేషన్ కార్డుదారులకు రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 1.05 కోట్ల లబ్ధిదారుల కుటుంబాలకు ఆధునిక స్మార్ట్ రేషన్ కార్డులు అందించేందుకు రాష్ట్ర పౌరసరఫరాల శాఖ ఏర్పాట్లు పూర్తి చేసింది. క్రెడిట్, డెబిట్ కార్డు పరిమాణంలో ఉండే ఈ కొత్త కార్డుల్లో క్యూఆర్ కోడ్ సౌకర్యం కల్పించారు. ఇప్పటికే కార్డుల ముద్రణ పూర్తై జిల్లాలకు పంపిణీ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయం మేరకు ఆగస్టు మొదటి వారంలో లేదా ఆగస్టు 15వ తేదీన స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా పంపిణీ ప్రారంభమయ్యే అవకాశం ఉంది. హైదరాబాద్‌లో జరిగే ప్రత్యేక కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా స్మార్ట్ కార్డుల పంపిణీ ప్రారంభం కానుండగా.. జిల్లాల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు లబ్ధిదారులకు కార్డులు అందజేయనున్నారు. కొత్త స్మార్ట్ కార్డులపై సీఎం రేవంత్ రెడ్డి, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఫోటోలను ప్రింట్ చేశారు. అయితే స్మార్ట్ కార్డుల పంపిణీకి ముందు ప్రభుత్వం ఈ-కేవైసీ ప్రక్రియను తప్పనిసరి చేసింది. రాష్ట్రంలో ఇంకా సుమారు 5 లక్షల మంది లబ్ధిదారులు ఈ-కేవైసీ పూర్తి చేయాల్సి ఉందని అధికారులు గుర్తించారు. అందుకే జూలై 31వ తేదీలోపు 100 శాతం ఈ-కేవైసీ పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ప్రత్యేక బృందాలు ఇంటింటికీ వెళ్లి నమోదు ప్రక్రియ నిర్వహించడంతో పాటు.. రేషన్ దుకాణాలు, ప్రత్యేక శిబిరాల ద్వారా కూడా సేవలు అందిస్తున్నారు. ఈ-కేవైసీ ద్వారా మరణించిన వారు లేదా శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారి వివరాలను గుర్తించి రేషన్ కార్డుల జాబితాను అప్‌డేట్ చేయనున్నారు. బయోమెట్రిక్ సమస్యలు ఉన్నవారు ఆధార్ సెంటర్లలో వేలిముద్రలు లేదా ఐరిస్ నమోదు చేయించుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. 5 ఏళ్లలోపు పిల్లలకు మినహాయింపు ఉండగా.. 8 ఏళ్లకు పైబడిన ప్రతి లబ్ధిదారుడు తప్పనిసరిగా ఈ-కేవైసీ పూర్తి చేయాలి. పౌరసరఫరాల శాఖ అధికారుల వెల్లడించిన వివరాల ప్రకారం.. ఈ-కేవైసీ చేయించుకోని లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులు జారీ చేయకూడదని అధికారులు నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఈ-కేవైసీ పూర్తి చేసుకున్న వారికి మాత్రమే ఈ స్మార్ట్ కార్డులను అందించనున్నారు. ఈ-కేవైసీ గడువు ఈనెల 31వ తేదీ వరకే ఉండటంతో ఆ లోగా అందరూ పూర్తి చేయాలని మరోసారి హితవు పలికారు. ఈ-కేవైసీ కోసం ఎవరూ సొంతూళ్లకు వెళ్లాల్సిన అవసరం లేదని.. ఎక్కడ ఉంటే అక్కడే సమీపంలో ఉన్న రేషన్ దుకాణానికి వెళ్లి బయోమెట్రిక్ నమోదు పూర్తి చేసుకోవాలని పౌరసరఫరాల శాఖ సూచించింది.

## ఓపెన్ వర్సిటీలో జపనీస్,
# జర్మన్, కొరియన్ భాషల్లో శిక్షణ

హైదరాబాద్, జూలై 26 (ఈవార్తలు): దూరవిద్య విధానంలో డిగ్రీ, పీజీ పూర్తిచేసిన నిరుద్యోగులు, విద్యార్థులకు విదేశాల్లో అద్భుతమైన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం కీలక నిర్ణయం తీసుకుంది. మారుతున్న కాలానికి అనుగుణంగా కేవలం డిగ్రీ పట్టాలతో సరిపెట్టకుండా.. విదేశీ కొలువులను సులువుగా సాధించేలా విద్యార్థులను సన్నద్ధం చేయాలని వర్సిటీ అధికారులు నిర్ణయించారు. ఇందులో భాగంగా ఆంగ్లంతో పాటు అత్యంత డిమాండ్ ఉన్న జపనీస్, జర్మన్, కొరియన్ వంటి విదేశీ భాషలను విద్యార్థులకు నేర్పించేందుకు సమగ్రమైన కార్యాచరణను రూపొందించారు. వృత్తి నిపుణులకు జర్మనీ, జపాన్, దక్షిణ కొరియా దేశాల్లో ఉద్యోగ అవకాశాలు క్రమేణా పెరుగుతుండటంతో ఈ మేరకు కీలక నిర్ణయం తీసుకున్నారు. విదేశాల్లో.. ముఖ్యంగా జపాన్, జర్మనీలతో పాటు కొరియా దేశాల్లో ఐదారేళ్లుగా ఉపాధి అవకాశాలు గణనీయంగా పెరుగుతున్నాయి. దీంతో ఆయా దేశాలు నైపుణ్యాలు, భాషా పరిజ్ఞానం కలిగిన నిపుణులు, సిబ్బంది కావాలంటూ భారతీయులను పెద్దఎత్తున ఆహ్వానిస్తున్నాయి. ఈ అవకాశాలను మన విద్యార్థులు అందిపుచ్చుకునేలా చేయడానికి డా.బీఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయం ఇటీవల ముంబయికి చెందిన ప్రముఖ ఇగ్నిటస్ ఎడ్యుటెక్ సంస్థతో అధికారికంగా ఒప్పందం కుదుర్చుకుంది. ఈ వర్సిటీలో ఏటా దాదాపు 30 వేల మంది విద్యార్థులు డిగ్రీ, పీజీ కోర్సులను పూర్తిచేస్తున్నారు. ఇందులో విద్యనభ్యసించి ఇప్పటికే ప్రైవేటు సంస్థలు, కేంద్ర ప్రభుత్వరంగ సంస్థల్లో విధులు నిర్వహిస్తున్న వారిని అలాగే నూతనంగా చదువు ముగిస్తున్న యువతను దృష్టిలో ఉంచుకుని ఈ విదేశీభాషల శిక్షణకు రంగం సిద్ధం చేశారు. కేవలం డా.బీఆర్ అంబేద్కర్ వర్సిటీ విద్యార్థులకు మాత్రమే కాకుండా.. ఇతర విశ్వవిద్యాలయాల్లో చదువుకున్న వారికి, అలాగే పాలిటెక్నిక్, ఇంజినీరింగ్ పూర్తిచేసిన అభ్యర్థులకు సైతం ఈ జపనీస్, జర్మన్, కొరియన్ భాషల్లో శిక్షణ అందించనున్నట్లు వర్సిటీ వర్గాలు వెల్లడించాయి. ఈ ప్రత్యేక శిక్షణా కార్యక్రమాల గురించి విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డాక్టర్ ఎల్. విజయకృష్ణారెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థుల సౌకర్యార్థం మూడు నెలలు, ఆరు నెలల కాలపరిమితితో ప్రత్యేక శిక్షణనిస్తామని తెలిపారు. కోర్సు విజయవంతంగా పూర్తి చేసుకున్న అభ్యర్థులకు విశ్వవిద్యాలయం తరఫున అధికారిక ధ్రువపత్రం అందజేస్తామని, ఇది విదేశీ ఉపాధి ప్రయత్నాలలో ఎంతో ఉపయోగపడుతుందని ఆయన స్పష్టం చేశారు.

## విదేశీ ఉద్యోగాల పేరుతో చీటింగ్

**విజయవాడ దంపతులపై హైదరాబాద్‌లో కేసు**

హైదరాబాద్, జూలై 26 (ఈవార్తలు): విదేశాల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ నిరుద్యోగుల నుంచి లక్షలాది రూపాయలు వసూలు చేసి మోసగించిన విజయవాడకు చెందిన దంపతులపై హైదరాబాద్‌లో కేసు నమోదైంది. సౌజన్య, శ్రీనివాస్ అనే ఈ జంట బేగంపేటలో 'ఫ్లయింగ్ బోర్డర్ కన్సల్టెన్సీ' పేరుతో సంస్థను నడుపుతూ ఈ మోసాలకు పాల్పడినట్లు పలువురు బాధితులు ఆరోపిస్తున్నారు. బాధితుల కథనం ప్రకారం, ఈ దంపతులు విదేశాల్లో మంచి ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మబలికి ఒక్కొక్కరి నుంచి రూ.4 లక్షల నుంచి రూ.14 లక్షల వరకు వసూలు చేశారు. నెలలు గడుస్తున్నా ఉద్యోగాలు ఇప్పించకపోగా, కట్టిన డబ్బులు కూడా తిరిగి ఇవ్వలేదని బాధితులు హైదరాబాద్ సెంట్రల్ క్రైమ్ స్టేషన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వీరి మోసం వల్ల తెలంగాణ వ్యాప్తంగా సుమారు 2,000 మంది ప్రభావితమై ఉండొచ్చని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే జంటపై గతవారమే విజయవాడలో ఇలాంటి మోసం కేసులోనే అరెస్ట్ అయ్యారని, బెయిల్‌పై బయటకు వచ్చిన తర్వాత కూడా మళ్లీ మోసాలు కొనసాగిస్తున్నారని బాధితులు పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ ఫిర్యాదు ఆధారంగా సీసీఎస్ పోలీసులు భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) సెక్షన్ 318 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. విజయవాడ సైబర్‌క్రైమ్ పోలీసుల దర్యాప్తులో ఈ దంపతుల మోసం భారీ స్థాయిలో ఉన్నట్లు తేలింది. యూకే, అమెరికా, ఆస్ట్రేలియా, యూరప్ దేశాల్లో నైపుణ్యం ఉన్న, లేని ఉద్యోగాల పేరుతో దాదాపు 750 మంది నిరుద్యోగుల నుంచి సుమారు రూ.11.46 కోట్ల నుంచి రూ.12 కోట్ల వరకు వసూలు చేసినట్లు పోలీసులు గుర్తించారు. కొంతకాలం పరారీలో ఉన్న వీరిని హైదరాబాద్‌లో అదుపులోకి తీసుకుని 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీకి తరలించారు. వసూలు చేసిన డబ్బులో కొంత భాగాన్ని ఈ దంపతులు రియల్ ఎస్టేట్ రంగంలోకి మళ్లించినట్లు దర్యాప్తులో వెల్లడైంది. 2024-2026 మధ్య కంకిపాడులో రూ.1.42 కోట్ల విలువైన మూడు ప్లాట్లను కొనుగోలు చేసినట్లు పోలీసులు గుర్తించారు.

## ప్రైవేట్ కంపెనీలపై
## హెచ్‌ఆర్‌సీకి అధికారం లేదు

**హెచ్‌ఆర్‌సీ పరిధి ప్రభుత్వ ఉద్యోగులకే పరిమితం**

**తెలంగాణ హైకోర్టు కీలక తీర్పు**

హైదరాబాద్, జూలై 26 (ఈవార్తలు): ప్రైవేట్ కంపెనీలు, వాటి ఉద్యోగులపై వచ్చే ఫిర్యాదులను విచారించే అధికారం రాష్ట్ర మానవ హక్కుల కమిషన్‌కు (హెచ్‌ఆర్‌సీ) లేదని తెలంగాణ హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది. హెచ్‌ఆర్‌సీ పరిధి కేవలం ప్రభుత్వ ఉద్యోగులు, వారి నిర్లక్ష్యానికి సంబంధించిన అంశాలకే పరిమితమని ఈ సందర్భంగా స్పష్టం చేసింది. వెల్స్ ఫార్గో ఇంటర్నేషనల్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లో పనిచేస్తున్న ఇద్దరు మహిళా ఉద్యోగులు, తమకు పనిప్రదేశంలో వేధింపులు ఎదురయ్యాయని ఆరోపిస్తూ హెచ్‌ఆర్‌సీని ఆశ్రయించారు. దీనిపై హెచ్‌ఆర్‌సీ జారీ చేసిన ఆదేశాలను సవాలు చేస్తూ సదరు సంస్థ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్, జస్టిస్ జి.ఎం. మొహియుద్దీన్‌లతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. ఉద్యోగ వివాదాలు, పనితీరు మదింపు వంటివి యజమాని, ఉద్యోగుల మధ్య ఉండే అంతర్గత వ్యవహారాలని ధర్మాసనం పేర్కొంది. ఇటువంటి సమస్యల పరిష్కారానికి ఇప్పటికే ప్రత్యేక చట్టపరమైన వేదికలు ఉన్నాయని తెలిపింది. ఆరోపణల తీవ్రతను బట్టి హెచ్‌ఆర్‌సీ తన అధికార పరిధిని విస్తరించుకోలేదని అభిప్రాయపడింది.

## నేటి నుంచి
## 'ఇంటింటికి తెలుగుదేశం'

మంగళగిరి, జూలై 26 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్‌లో ఎన్డీయే కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తవుతున్న సందర్భంగా, ప్రభుత్వ విజయాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు తెలుగుదేశం పార్టీ సిద్ధమైంది. టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు సారథ్యంలో 'ఇంటింటికి తెలుగుదేశం' పేరుతో భారీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నట్లు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ప్రకటించారు. రేపు సోమవారం (జులై 27) ప్రారంభమయ్యే ఈ కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా 45 రోజుల పాటు నిరంతరాయంగా కొనసాగుతుందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ, "ఎన్డీయే ప్రభుత్వ రెండేళ్ల సుపరిపాలనలో సాధించిన అభివృద్ధి, సంక్షేమ ఫలాలను ప్రతి గడపకూ వివరించడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశం. గత ఏడాది 'సుపరిపాలన తొలి ఏడాది' పేరుతో నిర్వహించిన కార్యక్రమాన్ని విజయవంతం చేసినట్లే, ఈసారి కూడా పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొనాలి" అని పిలుపునిచ్చారు. ఎన్నికల్లో ఇచ్చిన సూపర్-6 హామీల అమలు తీరును, వాటి ద్వారా మహిళలు, రైతులు, యువత, విద్యార్థులు పొందిన లబ్ధిని ప్రజలకు స్పష్టంగా తెలియజేయాలని సూచించారు. "గత ప్రభుత్వ విధ్వంసక పాలనకు, ప్రస్తుత ఎన్డీయే ప్రభుత్వ అభివృద్ధి పాలనకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని ప్రజలకు అర్థమయ్యేలా వివరించాలి. ఒకే రాజధాని, అభివృద్ధి వికేంద్రీకరణ విధానంతో పాటు ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను ప్రజల దృష్టికి తీసుకెళ్లాలి" అని పల్లా పేర్కొన్నారు.



## వైఎస్ షర్మిలకు సర్జరీ

విజయవాడ, జూలై 26 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (ఏపీసీసీ) అధ్యక్షురాలు వైఎస్ షర్మిల శస్త్రచికిత్స చేయించుకున్నారు. ఆసుపత్రి బెడ్‌పై చికిత్స పొందుతున్న ఆమె ఫొటో ఒకటి సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఆమె ఆరోగ్య పరిస్థితిపై పార్టీ శ్రేణుల్లో, ప్రజల్లో ఆందోళన వ్యక్తమైంది. ఈ ఊహాగానాలకు తెరదించుతూ, తన ఆరోగ్య పరిస్థితిపై షర్మిల స్వయంగా 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా స్పష్టత ఇచ్చారు. తనకు పొత్తికడుపుకు సంబంధించిన ఒక సాధారణ ఆపరేషన్ జరిగిందని, ప్రస్తుతం వేగంగా కోలుకుంటున్నానని తెలిపారు. ఈ మేరకు ఆమె ఒక పోస్ట్ చేస్తూ.. "ఇటీవల నాకు పొత్తికడుపు ఆపరేషన్ జరిగింది. ప్రస్తుతం నేను బాగున్నాను, చాలా వేగంగా కోలుకుంటున్నాను. మీ అందరితో పంచుకోవడం ఎంతో సంతోషంగా ఉంది. ఈ సమయంలో నా కోసం ప్రార్థనలు చేసిన వారికి, ధైర్యం చెప్పిన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక ధన్యవాదాలు. మీ ప్రేమ, ఆదరణ, ఆశీస్సులు నాకు ఎంతో బలాన్నిచ్చాయి" అని పేర్కొన్నారు.

## మీరిచ్చే ప్రతి పైసా..
## ప్రజాస్వామ్య పరిరక్షణకే!

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

*అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.*

**- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్**

సందేహాలకు **94404 55811**
నంబర్‌ను సంప్రదించవచ్చు.

## విద్యాశాఖ మంత్రిగా రేవంత్ రాజీనామా చేయాల్సిందే

**తెలంగాణ బీజేపీ డిమాండ్**

హైదరాబాద్, జూలై 26 (ఈవార్తలు): తెలంగాణలో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల చెల్లింపు వ్యవహారంపై కాంగ్రెస్ ప్రభుత్వం, బీజేపీ మధ్య మాటల యుద్ధం ముదిరింది. వారం రోజుల్లోగా పెండింగ్‌లో ఉన్న ఫీజు బకాయిలను విడుదల చేయాలని, లేనిపక్షంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యాశాఖ మంత్రి పదవికి రాజీనామా చేయాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో సుమారు రూ.12,000 కోట్ల ఫీజు బకాయిలను ప్రభుత్వం చెల్లించకపోవడంతో దాదాపు 20 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రమాదంలో పడిందని ఆరోపించారు. నీట్ పేపర్ లీక్ ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసిన విషయాన్ని గుర్తుచేస్తూ.. "మేం మా చిత్తశుద్ధిని నిరూపించుకున్నాం, మీరు కూడా మీ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలి" అని రేవంత్ రెడ్డిని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. ఢిల్లీలో విద్యార్థులపై పోలీసుల దౌర్జన్యం జరిగిందంటూ ఇక్కడ ర్యాలీ తీసిన ముఖ్యమంత్రి, రాష్ట్రంలోని విద్యార్థుల సమస్యలను పట్టించుకోకపోవడం దారుణమని విమర్శించారు. మరోవైపు, బీజేపీ ఎంపీ డీకే అరుణ కూడా ఈ విషయంపై స్పందించారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వాన్ని అస్థిరపరిచేందుకు ఆమ్ ఆద్మీ పార్టీకి చెందిన ఓ వ్యక్తి యువతను రెచ్చగొట్టే ప్రయత్నం చేశాడని ఆమె ఆరోపించారు. ఢిల్లీలో జరిగిన నిరసనల్లో విద్యార్థుల కన్నా బయటి ప్రాంతాల వారే ఎక్కువగా పాల్గొన్నారని, విదేశాల నుంచి నిధులు పంపి అల్లర్లు సృష్టించేందుకు దేశ వ్యతిరేకులు కుట్ర పన్నారని ఆమె సంచలన ఆరోపణలు చేశారు. నీట్ పేపర్ లీక్ అయిన వెంటనే కేంద్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుందని డీకే అరుణ స్పష్టం చేశారు. పరీక్షను రద్దు చేసి, తక్కువ సమయంలోనే మళ్లీ నిర్వహించి విద్యార్థుల ప్రయోజనాలను కాపాడిందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీయే యువతను రెచ్చగొట్టి దేశ ప్రతిష్ఠను దిగజార్చే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. పార్లమెంటులో చర్చకు సిద్ధపడని రాహుల్ గాంధీ, నల్ల బట్టలు వేసుకుని వీధుల్లో నిరసనలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. గత బీఆర్ఎస్ హయాంలో గ్రూప్-1 పేపర్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో పదో తరగతి పేపర్ లీక్ అయినప్పుడు ఎవరూ ఎందుకు రాజీనామా చేయలేదని ఆమె నిలదీశారు.

## చామల వర్సెస్ మందుల సామేల్

**చామల అనుచరులపై సామేల్ వర్గం దాడి**

తిరుమలగిరి(తుంగతుర్తి), జూలై 26 (ఈవార్తలు): తెలంగాణ కాంగ్రెస్‌లో నేతల మధ్య వర్గపోరు ముదురుతోంది. ఈసారి ఏకంగా ఎంపీ వర్సెస్ ఎమ్మెల్యేగా మారింది పరిస్థితి. భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే మందుల సామేల్ మధ్య వివాదం మరింత తీవ్రమైంది. తుంగతుర్తి నియోజకవర్గం తిరుమలగిరిలో ప్రెస్‌మీట్ నిర్వహిస్తుండగా ఎంపీ చామల అనుచరుడు పత్రపాటి యుగంధర్‌పై మందుల సామేల్ అనుచరులు హత్యాయత్నానికి పాల్పడ్డారు. యుగంధర్‌ను చుట్టుముట్టి పిడిగుద్దులతో విరుచుకుపడ్డారు. అప్రమత్తమైన పోలీసులు మందుల సామేల్ అనుచరులను చెదరగొట్టారు. తుంగతుర్తి వివాదంపై ఇటీవలే ఇరువర్గాల ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే మందుల సామేల్ మధ్య నెలకొన్న విభేదాలను చక్కబెట్టే ప్రయత్నం చేసింది కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ. జగ్గారెడ్డి స్వయంగా ఇరువురితో, ఇతర నాయకులతో మాట్లాడి సయోధ్యకు యత్నించారు.

# వేములవాడ ఆలయ అభివృద్ధికి మరో 99.40 కోట్లు



వేములవాడ అర్బన్, జూలై 26 (ఈవార్తలు): దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం సమగ్ర అభివృద్ధి, విస్తరణ పనులకు రాష్ట్ర ప్రభుత్వం మరో రూ.99.40 కోట్లు మంజూరు చేసింది. ఈ మేరకు సంబంధిత శాఖ అధికారులు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. తాజా నిధుల విడుదలతో ఆలయ అభివృద్ధి కోసం ప్రభుత్వం ఇప్పటివరకు కేటాయించిన మొత్తం నిధులు రూ.249.40 కోట్లకు చేరాయి. ప్రజా ప్రభుత్వంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో రాజన్న ఆలయ అభివృద్ధికి దశలవారీగా భారీ నిధులు కేటాయిస్తున్నారు. ఇందులో భాగంగా 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.50 కోట్లు, 2024-25లో రూ.100 కోట్లు విడుదల చేయగా, తాజాగా మరో రూ.99.40 కోట్లు మంజూరు చేయడంతో అభివృద్ధి పనులు మరింత వేగం పుంజుకోనున్నాయి. ఆలయానికి వచ్చే లక్షలాది మంది భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడం, ఆలయ పరిసరాలను ఆధునికీకరించడం, విశాలమైన యాత్రికుల వసతి సముదాయాలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి వంటి లక్ష్యాలతో పనులు కొనసాగుతున్నాయి. ఇప్పటికే సుమారు 45 శాతం పనులు పూర్తయ్యాయని అధికారులు తెలిపారు. తాజా నిధులతో మిగిలిన నిర్మాణాలు, మౌలిక వసతుల అభివృద్ధి, ఆలయ పరిసరాల సుందరీకరణ, భక్తులకు అవసరమైన సౌకర్యాల కల్పన వంటి పనులను వేగవంతం చేయనున్నట్లు పేర్కొన్నారు. దీంతో వేములవాడకు వచ్చే భక్తుల సంఖ్య మరింత పెరిగే అవకాశముందని అధికారులు అభిప్రాయపడుతున్నారు. ఈ సందర్భంగా నిధుల మంజూరుకు సహకరించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్సీ అద్లూరి లక్ష్మణ్ కుమార్‌లకు రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఆలయ అభివృద్ధిని రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిందని ఆయన అన్నారు. శృంగేరి శారదా పీఠాధిపతి జగద్గురు శ్రీశ్రీశ్రీ విధుశేఖర భారతి మహాస్వామిని పలుమార్లు కలిసి రాజన్న ఆలయ అభివృద్ధిపై సలహాలు, సూచనలు తీసుకున్నామని, త్వరలోనే మరోసారి శృంగేరి వెళ్లి స్వామివారిని కలిసి తదుపరి కార్యాచరణపై చర్చిస్తామని ఆది శ్రీనివాస్ తెలిపారు. వేములవాడ రాజన్న ఆలయం తెలంగాణతో పాటు దేశవ్యాప్తంగా కోట్లాది మంది భక్తుల ఆరాధ్యక్షేత్రంగా నిలిచిందని, విస్తరణ పనులు పూర్తయితే ఆధ్యాత్మిక కేంద్రంతో పాటు ప్రముఖ పర్యాటక కేంద్రంగా కూడా మరింత గుర్తింపు పొందుతుందని స్థానికులు, భక్తులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



## కల్యాణకట్టలో నగదు వసూళ్లు చేస్తే కఠిన చర్యలు: ఈవో

వేములవాడ అర్బన్, జూలై 26 (ఈవార్తలు): వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలోని కల్యాణకట్టలో భక్తుల నుంచి నగదు వసూలు చేస్తున్నారనే వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో దేవస్థానం కార్యనిర్వహణాధికారి (ఈవో) ఎల్. రమాదేవి స్పందించారు. ఇటువంటి ఘటనలు దేవస్థానం ప్రతిష్ఠకు భంగం కలిగిస్తాయని పేర్కొంటూ బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గత రెండు మూడు రోజులుగా కల్యాణకట్టలో విధులు నిర్వహిస్తున్న నాయి బ్రాహ్మణులు భక్తుల వద్ద నుంచి నగదు డిమాండ్ చేస్తున్నారనే వీడియోలు ప్రచారంలోకి వచ్చాయని, ఈ విషయాన్ని దేవస్థానం తీవ్రంగా పరిగణిస్తోందని ఈవో తెలిపారు. భక్తులకు ఏవైనా ఇబ్బందులు ఎదురైతే సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేయకుండా నేరుగా దేవస్థానం కార్యాలయంలో లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయాలని సూచించారు. ఫిర్యాదులపై సమగ్ర విచారణ జరిపి తగిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కల్యాణకట్టలో విధులు నిర్వహిస్తున్న నాయి బ్రాహ్మణులను కార్యాలయానికి పిలిపించి ఈవో రమాదేవి సమావేశమయ్యారు. భక్తులతో మర్యాదగా వ్యవహరించాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ నగదు డిమాండ్ చేయరాదని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఇటువంటి ఘటనలు పునరావృతమైతే సంబంధిత బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఆలయ అసిస్టెంట్ ఈవోలు జయకుమారి, నాగుల మహేష్, పర్యవేక్షకులు శ్రీనివాస్ శర్మ, రాజేందర్, ఆలయ ఉద్యోగులు, నాయి బ్రాహ్మణులు పాల్గొన్నారు.




## వేములవాడలో ముగిసిన వీహెచ్‌పీ ప్రాంత సమావేశాలు

వేములవాడ అర్బన్, జూలై 26 (ఈవార్తలు): వేములవాడలో మూడు రోజుల పాటు నిర్వహించిన విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ) ప్రాంత సమావేశాలు ఆదివారం ఘనంగా ముగిశాయి. చివరి రోజు కార్యకర్తలు నగర సంకీర్తన నిర్వహిస్తూ దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానానికి చేరుకుని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన ముగింపు సమావేశంలో విశ్వహిందూ పరిషత్ జాతీయ సంయుక్త కార్యదర్శి కోటేశ్వర శర్మ మాట్లాడుతూ భారతీయ కుటుంబ వ్యవస్థ, నైతిక విలువలను పరిరక్షించుకోవాల్సిన అవసరాన్ని వివరించారు. యువతలో సంస్కారాలు, దేశభక్తి, సామాజిక బాధ్యతను పెంపొందించే దిశగా కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా రాజన్న సిరిసిల్ల ఉమ్మడి జిల్లా నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. జిల్లా అధ్యక్షుడిగా ఇనుగంటి మధుసూదన్, జిల్లా కార్యదర్శిగా గడప కిషోర్ రావు, జిల్లా ఉపాధ్యక్షుడిగా నాగుల రాములు గౌడ్‌ను నియమించారు. ఈ కార్యక్రమంలో క్షేత్ర ప్రముఖులు గుమ్మల సత్యం, రాష్ట్ర అధ్యక్షుడు నరసింహమూర్తి, రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీనారాయణ, విభాగ కార్యదర్శి రవీందర్, పట్టణ అధ్యక్షుడు పల్లె శ్యాంసుందర్ రెడ్డి, పట్టణ కార్యదర్శి గుండోజి గోపాల్, ఉపాధ్యక్షులు చేకూర్తి నవీన్, తోట అజయ్, ఉడుతల బాలు, చందన రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## 20 ఏళ్ల నిరీక్షణకు ముగింపు

**వేములవాడ-సిరికొండ మధ్య కొత్త బస్సు**

వేములవాడ అర్బన్, జూలై 26 (ఈవార్తలు): దాదాపు రెండు దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న ప్రజల ఆకాంక్ష నెరవేరింది. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ ఆర్టీసీ డిపో నుంచి చందుర్తి మండలంలోని ఎనగల్, బండపల్లి, మరిమడ్ల గ్రామాల మీదుగా నిజామాబాద్ జిల్లా సిరికొండ వరకు కొత్త ఆర్టీసీ బస్సు సేవలను రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ఈ కొత్త బస్సు సేవలతో విద్యార్థులు, ఉద్యోగులు, రైతులు, వ్యాపారులు, సాధారణ ప్రయాణికులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని పేర్కొన్నారు. ఈ కొత్త మార్గం ద్వారా రాజన్న సిరిసిల్ల, నిజామాబాద్ జిల్లాల మధ్య రవాణా అనుసంధానం మరింత బలోపేతం కానుందని, గ్రామీణ ప్రాంతాల ప్రజలు జిల్లా కేంద్రాలకు, ఇతర ప్రాంతాలకు సులభంగా ప్రయాణించే అవకాశం లభిస్తుందని ఆయన అన్నారు. ఇరవై ఏళ్లుగా ఈ బస్సు సౌకర్యం కోసం ఎదురుచూస్తున్న ప్రజల కోరిక నెరవేరడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. రెండు జిల్లాల మధ్య రాకపోకలు సులభతరం కావడంతో పాటు విద్య, వైద్యం, ఉపాధి అవసరాల కోసం ప్రయాణించే వారికి ఈ సేవలు ఎంతో ఉపయోగపడనున్నాయని అభిప్రాయపడ్డారు.





## ఛత్రపతి సాహు మహారాజ్‌కు ఘన నివాళి

హనుమకొండ, జూలై 26 (ఈవార్తలు): తెలంగాణ బీసీ మహాసేన ఆధ్వర్యంలో రిజర్వేషన్ల పితామహుడు ఛత్రపతి సాహు మహారాజ్ జయంతి వేడుకలను హనుమకొండలోని బీసీ మహాసేన కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, భారతదేశంలో తొలిసారిగా రిజర్వేషన్ విధానాన్ని అమలు చేసి అట్టడుగు వర్గాల సామాజిక, విద్యా, ఆర్థిక అభివృద్ధికి మార్గం సుగమం చేసిన మహనీయుడు ఛత్రపతి సాహు మహారాజ్ అని కొనియాడారు. విద్య, ఉద్యోగ అవకాశాలు, స్కాలర్‌షిప్‌లు అందించి వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి విశేష కృషి చేశారని తెలిపారు. మహిళా విద్యాభివృద్ధికి హాస్టళ్లు, విద్యాసంస్థలు ఏర్పాటు చేసి సమాన అవకాశాలను కల్పించారని, సమాజంలో మార్పుకు విద్యే పునాది అని విశ్వసించిన గొప్ప సంస్కర్తగా ఆయనను గుర్తు చేశారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విదేశీ విద్యాభ్యాసానికి సాహు మహారాజ్ ఆర్థిక సహాయం అందించడమే కాకుండా, ఆయన ఉన్నత విద్య కొనసాగించేందుకు నిరంతర ప్రోత్సాహం అందించారని పేర్కొన్నారు. అంబేద్కర్ దేశ రాజ్యాంగ నిర్మాతగా ఎదగడంలో సాహు మహారాజ్ సహకారం కీలక పాత్ర పోషించిందని అభిప్రాయపడ్డారు. సాహు మహారాజ్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని బీసీలు తమ హక్కుల సాధన కోసం ఐక్యంగా పోరాడాలని, సామాజిక న్యాయం కోసం అందరూ కలిసికట్టుగా ముందుకు రావాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ బీసీ మహాసేన రాష్ట్ర ఫౌండర్ చైర్మన్ తాడిశెట్టి క్రాంతి కుమార్, రజక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చాపర్తి కుమార్ గాడ్గే, తాడిశెట్టి కార్తీక్, బీసీ ఎంప్లాయీస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సేవాభావంతో విధులు నిర్వర్తించాలి

**ఓర్టస్‌లో ఘనంగా ల్యాంప్ లైటింగ్, ఓత్ టేకింగ్ వేడుక**



విశాఖపట్నం, జూలై 26 (ఈవార్తలు): నర్సింగ్ వృత్తిలో సేవాభావం అత్యంత ముఖ్యమని, విద్యార్థులు మానవతా దృక్పథంతో విధులు నిర్వహించాలని ఓర్టస్ ఎడ్యుకేషనల్ సొసైటీ డైరెక్టర్ అండ్ సెక్రటరీ పి. స్వాతి అన్నారు. నగర పరిధిలోని పెందుర్తి ఓర్టస్ కాలేజ్ అండ్ స్కూల్ ఆఫ్ నర్సింగ్ ఆధ్వర్యంలో నాయుడుతోట సమీపంలోని ఓ కల్యాణ మండపంలో శనివారం నిర్వహించిన ల్యాంప్ లైటింగ్ అండ్ ఓత్ టేకింగ్ సెరిమనీలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, నర్సింగ్ అనేది కేవలం ఉద్యోగం మాత్రమే కాకుండా మానవ సేవకు అంకితమైన గొప్ప వృత్తి అని పేర్కొన్నారు. వృత్తిపట్ల నిబద్ధత, సేవా దృక్పథం, కరుణాభావం ఉంటేనే ఉత్తమ నర్సులుగా ఎదగగలరని సూచించారు. నర్సింగ్ కోర్సు పూర్తిచేసిన విద్యార్థులకు దేశ, విదేశాల్లో విస్తృత ఉపాధి అవకాశాలు ఉన్నాయని, సేవాభావాన్ని ఎప్పటికీ కోల్పోకూడదని ఆమె తెలిపారు. అనంతరం విద్యార్థులు నర్సింగ్ వృత్తి నైతిక విలువలను పాటిస్తూ సేవలు అందిస్తామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో సర్వమత ప్రార్థనలు నిర్వహించి, విద్యార్థులకు ల్యాంప్ లైటింగ్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ గ్రేసీ, అధ్యాపకులు నవీన, పావని, శ్రావణి, అధితి, హెన్నా, సిమ్రాన్, మేరీ, ఝాన్సీతో పాటు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## జమ్మికుంటలో 'అవొపా మెరిట్ అవార్డ్స్-2026'



జమ్మికుంట, జూలై 26 (ఈవార్తలు): జమ్మికుంట పట్టణంలో ఆర్యవైశ్య అవొపా జమ్మికుంట శాఖ ఆధ్వర్యంలో 'అవొపా మెరిట్ అవార్డ్స్-2026' కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆర్యవైశ్య సంఘ సభ్యులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, ప్రముఖులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా పదో తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీతో పాటు వివిధ పోటీ పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ఆర్యవైశ్య విద్యార్థులను మెమెంటోలు, ప్రశంసాపత్రాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మాట్లాడిన అవొపా నాయకులు, విద్యార్థుల్లో ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడమే మెరిట్ అవార్డుల ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ప్రతి ఏడాది ఇలాంటి కార్యక్రమాలను నిర్వహిస్తూ విద్యార్థులకు అన్ని విధాలా అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు. జమ్మికుంట అవొపా అధ్యక్షుడు అకినపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ, విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవడంతో పాటు కుటుంబానికి, సమాజానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమం విజయవంతానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర అవొపా అధ్యక్షుడు మల్లిపెద్ది శంకర్, కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు కొమురవెల్లి వెంకటేశం, రాష్ట్ర ఉపాధ్యక్షులు వీరబోయిన రమేష్, సామానారాయణ, పీవీ రామకృష్ణ, జిల్లా బాధ్యులు ఐత సుధాకర్, మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్ కుమార్, ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు లెంకల్లపల్లి శరత్ కుమార్, జమ్మికుంట అవొపా ప్రధాన కార్యదర్శి నగేష్, మంచాల రాంబాబు, జోన్ ట్రెజరర్ బచ్చు రమేష్, సంఘ సభ్యులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.




## ఐటీ ప్రొఫెషనల్స్ ఐక్యతతో మరిన్ని అవకాశాలు

గ్లోబల్ మున్నూరు కాపు అసోసియేషన్ కార్యక్రమంలో నవీన్ పటేల్

హైదరాబాద్, జూలై 26 (ఈవార్తలు): గ్లోబల్ మున్నూరు కాపు అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఐటీ ప్రొఫెషనల్స్ మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమంలో తెలంగాణ ప్రైవేట్ ఉద్యోగుల ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నవీన్ పటేల్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అసోసియేషన్ ఫౌండింగ్ సభ్యులు రజనీకాంత్ సంఘానీ, ప్రవీణ్ ఆనంద్ పల్లి, అధ్యక్షుడు వంశీ దామెర ఆహ్వానం మేరకు ఆయన కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా నవీన్ పటేల్ మాట్లాడుతూ, ప్రపంచవ్యాప్తంగా ఉన్న మున్నూరు కాపు ఐటీ నిపుణులను ఒకే వేదికపైకి తీసుకువచ్చేందుకు గ్లోబల్ మున్నూరు కాపు అసోసియేషన్ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. వివిధ సంస్థల్లో ఉన్నత స్థాయిలో పనిచేస్తున్న ఐటీ నిపుణులు తమ అనుభవాన్ని యువతతో పంచుకుంటూ వారికి సరైన మార్గదర్శకత్వం అందించడంతో పాటు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేయాలని కోరారు. మున్నూరు కాపు యువత నైపుణ్యాభివృద్ధిపై దృష్టి సారించి, పరస్పర సహకారంతో ముందుకు సాగితే ఉద్యోగ, వ్యాపార, పారిశ్రామిక, రాజకీయ రంగాల్లో మరింతగా రాణించే అవకాశాలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. సమాజ అభివృద్ధికి ఐకమత్యమే ప్రధాన బలమని, అందరూ కలిసికట్టుగా పనిచేస్తే మరింత పురోగతి సాధించవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్నూరు కాపు రాష్ట్ర నాయకులు ఆకుల వివేక్ పటేల్, వాసాల వెంకటేశ్వర్లు, పేరుక రమేష్, వాసాల రాజు, ఏవి ప్రమోద్, యుగంధర్, సురేందర్, క్రాంతి, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

## జగిత్యాల జిల్లా స్వర్ణకారుల సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

మల్యాల, జూలై 26 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా స్వర్ణకారుల సంఘం నూతన కార్యవర్గ ఎన్నికలు ఆదివారం ప్రశాంత వాతావరణంలో జరిగాయి. సంఘ సభ్యులు ఉత్సాహంగా పాల్గొని తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎన్నికల ఫలితాల ప్రకారం సంఘ అధ్యక్షుడిగా గన్నేరువరం బుచ్చయ్య, ఉపాధ్యక్షుడిగా కట్ట వినోద్, ప్రధాన కార్యదర్శిగా సింహారాజు శ్రీధర్, సహాయ కార్యదర్శిగా ఇనుగుర్తి సురేష్, కోశాధికారిగా సింహారాజు అరుణ్ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులను సంఘ సభ్యులు ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. స్వర్ణకారుల సంక్షేమం, సంప్రదాయ వృత్తి అభివృద్ధి, సభ్యుల సమస్యల పరిష్కారం కోసం సమిష్టిగా కృషి చేస్తామని నూతన కార్యవర్గం హామీ ఇచ్చింది. ఈ కార్యక్రమంలో సంఘ పెద్దలు, సభ్యులు, జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన స్వర్ణకారులు పాల్గొని నూతన కార్యవర్గానికి అభినందనలు తెలియజేశారు.



# ఇక ఎన్నికల్లో పోటీ చేయను

## రాజకీయాలు కలుషితం అయ్యాయి.. కర్ణాటక మాజీ సీఎం సిద్ధరామయ్య



మాండ్య: కర్ణాటక మాజీ సీఎం సిద్ధరామయ్య సంచలన ప్రకటన చేశారు. తాను 2028 అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయబోనని, ఎన్నికల రాజకీయాల నుంచి శాశ్వతంగా వైదొలుగుతున్నానని స్పష్టం చేశారు. అయితే, ప్రజా జీవితంలోనే కొనసాగుతూ ప్రజల పక్షాన తన గొంతు వినిపిస్తూనే ఉంటానని ఆయన తెలిపారు. మండ్య జిల్లాలోని కే.ఆర్. పేట పట్టణంలో జరిగిన ఓ కార్యక్రమంలో మద్దతుదారులను ఉద్దేశించి సిద్ధరామయ్య ఈ వ్యాఖ్యలు చేశారు. "రాజకీయాలు ప్రస్తుతం అత్యంత కలుషితమయ్యాయి. నిజాయతీతో కూడిన రాజకీయాలు మనుగడ సాగించే పరిస్థితి లేదు. ఈ నేపథ్యంలో భవిష్యత్తులో ఎలాంటి ఎన్నికల్లోనూ పోటీ చేయకూడదని నిర్ణయించుకున్నాను" అని ఆయన అన్నారు. 2028 నాటికి తన వయసు 82 ఏళ్లకు చేరుకుంటుందని, అప్పుడు ఇప్పుడున్నంత ఉత్సాహంగా, ఆరోగ్యంగా పనిచేయలేకపోవచ్చని పేర్కొన్నారు. ఈ ప్రకటనతో అక్కడున్న మద్దతుదారులు, కార్యకర్తలు తీవ్ర నిరాశకు గురయ్యారు. మరో పదేళ్ల పాటు క్రియాశీల రాజకీయాల్లోనే ఉండాలని వారు సిద్ధరామయ్యను కోరారు. అయినప్పటికీ, ఆయన తన నిర్ణయానికే కట్టుబడి ఉన్నట్లు పునరుద్ఘాటించారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో, సిద్ధరామయ్య తన నిర్ణయాన్ని ఆదివారం 'ఎక్స్' వేదికగా మరోసారి ధ్రువీకరించారు. "నేను 2028 అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయకపోయినా, రాజకీయాల్లో చురుకుగా ఉంటూ ప్రజల కష్టసుఖాల్లో పాలుపంచుకుంటాను" అని ఆయన స్పష్టం చేశారు. వరుణ నియోజకవర్గ ప్రజలు తనను మరోసారి పోటీ చేయాలని కోరుతున్నప్పటికీ, తాను ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. గతంలో ఎన్నికల తీరును గుర్తుచేసుకుంటూ, "అప్పట్లో మేం ఎన్నికల్లో పోటీ చేస్తున్నప్పుడు నియోజకవర్గ ప్రజలే ఆర్థికంగా సహాయం చేసి గెలిపించేవారు. కానీ నేటి పరిస్థితి పూర్తిగా భిన్నంగా ఉంది" అని ప్రస్తుత రాజకీయాల్లో పెరిగిపోయిన ఖర్చు గురించి ఆవేదన వ్యక్తం చేశారు. 1978లో తాలూకా బోర్డు సభ్యుడిగా తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించిన సిద్ధరామయ్య, 2028 నాటికి ప్రజా జీవితంలో 50 ఏళ్లు పూర్తి చేసుకుంటారు. "ఈ సుదీర్ఘ ప్రయాణంలో గెలుపోటములను చూశాను. కానీ, నేను నమ్మిన సిద్ధాంతాలకు వ్యతిరేకంగా గానీ, నా అంతరాత్మకు విరుద్ధంగా గానీ ఎప్పుడూ ప్రవర్తించలేదు" అని అన్నారు. దశాబ్దాలుగా కర్ణాటక ప్రజలు తనపై చూపిన ఆదరాభిమానాలకు ఎప్పటికీ రుణపడి ఉంటానని, తన మిగిలిన జీవితాన్ని ప్రజా సేవకే అంకితం చేస్తానని సిద్ధరామయ్య తెలిపారు. కాగా, సిద్ధరామయ్య రెండు పర్యాయాలుగా మొత్తం ఎనిమిదేళ్లకు పైగా కర్ణాటక ముఖ్యమంత్రిగా పనిచేసి, రాష్ట్ర చరిత్రలో ఎక్కువ కాలం సీఎం పదవిలో ఉన్న నేతగా రికార్డు సృష్టించారు. 2013 నుంచి 2018 వరకు పూర్తి ఐదేళ్ల పాటు, ఆ తర్వాత 2023 నుంచి 2026 వరకు రెండోసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు. ఆయన గతంలో 2013, 2018, 2024 ఎన్నికల సమయంలోనూ ఇలాంటి ప్రకటనలు చేసినప్పటికీ, తాజా వ్యాఖ్యలతో ఆయన రాజకీయ భవిష్యత్తుపై మరోసారి చర్చ మొదలైంది.



## నేపాల్ నాణెంపై భారత ప్రాంతాలు!

**వివాదాస్పద మ్యాప్ ముద్రణకే మొగ్గు**

ఖట్మండు: భారత్‌తో సరిహద్దు వివాదం కొనసాగుతున్నప్పటికీ, నేపాల్ మరోసారి తన పాత వైఖరినే ప్రదర్శించింది. వివాదాస్పద ప్రాంతాలైన లింపియాధురా, లిపులేఖ్, కాలాపానీలను తమ భూభాగంలో చూపిస్తూ రూపొందించిన మ్యాప్‌తోనే నూతన రూపాయి నాణేన్ని ముద్రించాలని ఆ దేశం నిర్ణయించింది. ఈ ప్రాంతాలు తమవేనని నేపాల్ వాదిస్తుండగా, అవి ఉత్తరాఖండ్‌లో అంతర్భాగమని భారత్ స్పష్టం చేస్తోంది. వాస్తవానికి, ప్రస్తుత ప్రధాని బాలెన్ షా నేతృత్వంలోని ప్రభుత్వం ఈ వివాదాస్పద మ్యాప్‌ను నాణెం నుంచి తొలగించి, దాని స్థానంలో ఒక మఠం చిత్రాన్ని ముద్రించాలని తొలుత భావించింది. అయితే, దేశంలోని ప్రతిపక్ష పార్టీల నుంచి తీవ్ర వ్యతిరేకత, ఒత్తిడి రావడంతో ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంది. పాత మ్యాప్‌తోనే నాణేన్ని ముద్రించాలని తాజాగా ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు నేపాల్ జాతీయ బ్యాంక్ అధికారి గురు ప్రసాద్ పౌడెల్ అధికారికంగా ప్రకటన చేశారు. 2020లో అప్పటి కేపీ ఓలీ శర్మ ప్రభుత్వం ఈ మూడు ప్రాంతాలను తమ దేశంలో కలుపుతూ కొత్త రాజకీయ పటాన్ని విడుదల చేసిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి ఇరు దేశాల మధ్య ఈ అంశంపై విభేదాలు కొనసాగుతున్నాయి. ఎలాంటి సమస్యనైనా ద్వైపాక్షిక చర్చల ద్వారానే పరిష్కరించుకోవాలని భారత్ సూచిస్తోంది.

## నీట్ నిరసనలు.. తేజ్ ప్రతాప్‌కు 14 రోజుల జైలు

పాట్నా: జన్ శక్తి జనతా దళ్ అధినేత తేజ్ ప్రతాప్ యాదవ్‌ను బీహార్ పోలీసులు అరెస్టు చేశారు. ఆయనకు పాట్నా జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించడంతో అధికారులు బేవూర్ సెంట్రల్ జైలుకు తరలించారు. నీట్ పేపర్ లీకేజీ ఉదంతం, ఢిల్లీలో విద్యార్థులపై పోలీసుల చర్యలను నిరసిస్తూ ప్రతిపక్షాలు, పలు సామాజిక సంస్థలు శనివారం బీహార్ బంద్‌కు పిలుపునిచ్చాయి. ఈ సందర్భంగా పాట్నాలో వేలాది మంది విద్యార్థులు, యువకులు రోడ్లపైకి వచ్చి భారీ ఎత్తున ఆందోళనలు చేపట్టారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ నిరసనకారులు పోలీసు వాహనాలను ధ్వంసం చేయడంతో పాటు ట్రాఫిక్ సిగ్నల్స్‌ను పగలగొట్టారు. దీంతో ఆ ప్రాంతంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. విద్యార్థుల పోరాటానికి సంఘీభావం తెలిపేందుకు తేజ్ ప్రతాప్ యాదవ్ పాట్నాలోని రామ్ గులాం చౌక్ వద్ద నిరసనలో పాల్గొన్నారు. విద్యార్థుల సమస్యలను కేంద్ర ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని, తమ పార్టీ ఎల్లప్పుడూ వారికి అండగా ఉంటుందని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. అనంతరం, సాయంత్రం సమయంలో దక్ బంగ్లా చౌరహా వద్ద పోలీసులు ఆయన్ను అదుపులోకి తీసుకున్నారు. శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత తేజ్ ప్రతాప్‌ను మేజిస్ట్రేట్ ముందు హాజరుపరచగా, కోర్టు ఆయనకు 14 రోజుల రిమాండ్ విధించింది. ఆదివారం కోర్టుకు సెలవు కావడంతో, సోమవారం బెయిల్ పిటిషన్ దాఖలు చేయనున్నట్లు ఆయన తరఫు న్యాయవాది వెల్లడించారు.

# యూపీలో పొత్తుకు మేం సిద్ధం

**అఖిలేశ్‌కు అసదుద్దీన్ ఆఫర్**



హైదరాబాద్, జూలై 26 (ఈవార్తలు): దేశ రాజకీయాల్లో అత్యంత కీలకమైన ఉత్తరప్రదేశ్‌లో మరోసారి రాజకీయ సమీకరణాలు వేడెక్కుతున్నాయి. 2027లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఓవైసీ, సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) అధినేత అఖిలేశ్ యాదవ్‌కు పొత్తు కోసం బహిరంగ ఆహ్వానం పంపారు. బీజేపీని మరోసారి అధికారంలోకి రాకుండా నిలువరించేందుకు కలిసి పనిచేయడానికి ఇదే సరైన సమయమని ఆయన స్పష్టం చేశారు. మొరాదాబాద్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో ఓవైసీ మాట్లాడుతూ.. "ఉత్తరప్రదేశ్‌లో బీజేపీ మళ్లీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడాన్ని మజ్లిస్ కోరుకోవడం లేదు. అందుకే నేను చేతులు కలపడానికి, పొత్తు పెట్టుకోవడానికి సిద్ధంగా ఉన్నాను. మాట్లాడటానికి ఇదే సరైన సమయం. ఎన్నికలు ముగిశాక తర్వాత ఏడవద్దు" అంటూ అఖిలేశ్ యాదవ్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. తమ పార్టీ పోటీ చేయడం వల్ల ఎస్పీకి నష్టం జరుగుతుందనే వాదనను ప్రస్తావిస్తూ, ఆ నష్టం జరగకుండా ఉండేందుకే తాను పొత్తుకు సిద్ధంగా ఉన్నానని వివరించారు. అయితే, ఈ పొత్తులో తమకు సమాన గౌరవం, హక్కులు కావాలని ఓవైసీ స్పష్టమైన సంకేతాలిచ్చారు. "మా పోరాటం ఏ మతానికి వ్యతిరేకం కాదు. మా గౌరవం, న్యాయం కోసమే ఈ పోరాటం. అఖిలేశ్ యాదవ్ కుర్చీలో కూర్చుంటే, నేను కూడా ఆయన ముందు సమానంగా కూర్చుని హక్కులు, న్యాయం గురించి చర్చిస్తాను" అని ఆయన పేర్కొన్నారు. ఓవైసీ పొత్తు ప్రతిపాదనపై బీజేపీ వెంటనే స్పందించింది. ఇది బుజ్జగింపు రాజకీయాల కలయిక అని బీజేపీ అధికార ప్రతినిధి షెహజాద్ పూనావాలా విమర్శించారు. "అఖిలేశ్, ఓవైసీ ఇద్దరూ బుజ్జగింపు రాజకీయాల్లో ఒకరితో ఒకరు పోటీ పడతారు. ఇప్పుడు 'పెద్ద భాయిజాన్ ఎవరు' అనే పోటీని పక్కనపెట్టి 'భాయిజాన్ కలయిక' కోసం చూస్తున్నారు. అందుకే ఓవైసీ, అఖిలేశ్‌కు ఫ్రెండ్ రిక్వెస్ట్ పంపుతున్నారు" అని ఆయన ఎద్దేవా చేశారు. కాగా, యూపీలో యోగి ఆదిత్యనాథ్ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వానికి ప్రధాన ప్రతిపక్షంగా సమాజ్‌వాదీ పార్టీ ఉంది. 2027 ఎన్నికలను పార్లమెంట్ ఎన్నికలకు సెమీ ఫైనల్‌గా భావిస్తున్న తరుణంలో ఓవైసీ ప్రతిపాదన ప్రాధాన్యం సంతరించుకుంది. అయితే, ఈ ఆఫర్‌పై అఖిలేశ్ యాదవ్ నుంచి ఇంకా ఎలాంటి స్పందన రాలేదు.

# వచ్చే వారం కర్ణాటక కేబినెట్ విస్తరణ

**కర్ణాటక సీఎం డీకే శివకుమార్ వెల్లడి**



బెంగళూరు: కర్ణాటక మంత్రివర్గాన్ని వచ్చే వారం విస్తరించే అవకాశం ఉందని ముఖ్యమంత్రి డీకే శివకుమార్ తెలిపారు. మంత్రులంతా ఐక్యంగా పనిచేస్తూ రాష్ట్రవ్యాప్తంగా నెలకొన్న తీవ్ర కరువు పరిస్థితులను ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. శనివారం చిత్రదుర్గలో జరిగిన బెంగళూరు రీజనల్ డివిజన్ అభివృద్ధి ప్రగతి సమీక్ష సమావేశంలో ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. "కేబినెట్‌ను వచ్చే వారం విస్తరించవచ్చు. అది జరిగిన వెంటనే మంత్రులంతా చేతులు కలిపి పనిచేయాలి. రాష్ట్రవ్యాప్తంగా కరువు పరిస్థితిని సమష్టిగా అంచనా వేసి, గ్రామాల్లో రైతులు ఇబ్బంది పడకుండా చూడటం మనందరి బాధ్యత" అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. అంతకుముందు, ఆయన చిత్రదుర్గ జిల్లా హిరియూరు తాలూకాలోని వడ్డికెరె గ్రామంలో పర్యటించి, కరువు రైతులపై చూపుతున్న ప్రభావాన్ని స్వయంగా పరిశీలించారు. ప్రభుత్వానికి, పరిపాలనకు కొత్త రూపు ఇవ్వడానికి ప్రయత్నిస్తున్నామని, శాసనసభ్యులు, అధికారులు "టీమ్ కర్ణాటక"గా పనిచేయాలని శివకుమార్ పిలుపునిచ్చారు. పాలన ప్రతి పౌరుడి గడప వద్దకు చేరాలని, ప్రజా సమస్యలను సమర్థవంతంగా పరిష్కరించేందుకే 'ప్రజా సేవా' విభాగాన్ని ఏర్పాటు చేశామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సరఫరా కోసం ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి రూ. 1 కోటి వరకు ఖర్చు చేసే అధికారం జిల్లా యంత్రాంగానికి ఉందని శివకుమార్ పునరుద్ఘాటించారు. కొత్తగా వేసిన బోరుబావుల జీపీఎస్ వివరాలు నమోదు చేయాలని, కరువు సహాయక చర్యల్లో పూర్తి పారదర్శకత పాటించాలని అధికారులను హెచ్చరించారు. ప్రజలకు, పశువులకు తాగునీటి కొరత రాకుండా, పశుగ్రాసం అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. భవిష్యత్తులో వర్షాలు కురుస్తాయనే అంచనాలతో రైతులు పంటలు వేయవద్దని విజ్ఞప్తి చేశారు. ఒకవేళ పంటలు వేసి నష్టపోతే బాధ్యత వారే వహించాల్సి ఉంటుందని, పంటల బీమాపై అధికారులు రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. అల్మట్టి మినహా చాలా జలాశయాల్లో నీటి మట్టాలు తక్కువగా ఉన్నాయని, ఈ పరిస్థితుల్లో తమిళనాడుకు కావేరి నీటిని విడుదల చేసే స్థితిలో లేమని సంబంధిత కమిటీకి తెలియజేశామన్నారు. ఎల్ నినో ప్రభావంపై ప్రధాని మోదీ కూడా హెచ్చరించారని, రాష్ట్రంలోని కరువు పరిస్థితులను వివరించేందుకు త్వరలో డిప్యూటీ సీఎం పరమేశ్వర నేతృత్వంలోని బృందం ప్రధానిని కలుస్తుందని తెలిపారు.

# తొలి రోజే రాజీనామాకు ధర్మేంద్ర రెడీ

**కానీ, పార్టీ అధిష్ఠానం వద్దనడంతో ఆపేశారు**

**కైలాశ్ విజయ వర్గీయ కీలక వ్యాఖ్యలు**



న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా సంచలనం రేపిన నీట్ పేపర్ లీకేజీని వ్యతిరేకిస్తూ.. దేశ రాజధాని ఢిల్లీలో కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ఆధ్వర్యంలో విద్యార్థులు చేపట్టిన ఆందోళనలు ప్రారంభమైన మొదటి రోజే అప్పటి కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేసేందుకు సిద్ధమయ్యారని మధ్యప్రదేశ్ మంత్రి, బీజేపీ సీనియర్ నేత కైలాష్ విజయవర్గీయ సంచలన వ్యాఖ్యలు చేశారు. పార్టీ అధిష్ఠానం నిర్ణయానికే కట్టుబడి పనిచేసే కార్యకర్తగా ధర్మేంద్ర ప్రధాన్ వ్యవహరించారని ఆయన ప్రశంసించారు. ఇండోర్‌లో మీడియాతో మాట్లాడిన కైలాష్ విజయవర్గీయ.. విద్యార్థుల నిరసనలు మొదలైన వెంటనే ధర్మేంద్ర ప్రధాన్.. బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్‌తో మాట్లాడుతూ.. అవసరమని భావిస్తే తాను వెంటనే రాజీనామా చేస్తానని చెప్పారని గుర్తు చేశారు. అయితే అప్పట్లో పార్టీ హైకమాండ్ రాజీనామా చేయవద్దని సూచించి.. ఈ అంశంపై ఎవరితోనూ మాట్లాడొద్దని చెప్పిందని పేర్కొన్నారు. ఆ తర్వాత పరిస్థితులు మారిపోయాయని.. బీజేపీ సమిష్టిగా నిర్ణయం తీసుకున్న వెంటనే ధర్మేంద్ర ప్రధాన్ ఎలాంటి ఆలస్యం చేయకుండా పదవికి రాజీనామా చేశారని కైలాష్ విజయవర్గీయ తెలిపారు. ఇదే ఒక నిజమైన పార్టీ కార్యకర్త లక్షణమని కొనియాడారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా వల్ల దేశంలో బంగ్లాదేశ్, శ్రీలంక తరహా హింసాత్మక పరిస్థితులు సృష్టించాలని ప్రయత్నించిన విదేశీ శక్తుల కుట్ర భగ్నమైందని కైలాష్ విజయవర్గీయ ఆరోపించారు. దేశ ప్రయోజనాల కోసం రాజీనామా చేస్తూ.. ధర్మేంద్ర ప్రధాన్ తీసుకున్న నిర్ణయాన్ని తాను అభినందిస్తున్నానని కైలాష్ విజయవర్గీయ చెప్పారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీపై కూడా ఆయన విమర్శలు గుప్పించారు. స్వయంగా విద్యార్థులు ఉద్యమం చేపట్టారని.. కానీ కాంగ్రెస్ కేవలం వారి వెనుక నిలబడి రాజకీయ లబ్ధి పొందాలని ప్రయత్నాలు చేసిందని తీవ్రంగా ఆరోపించారు. అదే సమయంలో ఆర్ఎస్ఎస్‌పై రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలను తప్పుపట్టిన విజయవర్గీయ.. దేశ అభివృద్ధిలో ఆ సంస్థ కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు.




## 31న ఈ10, ఈ20 పెట్రోల్‌పై ఆందోళనలు

**ఢిల్లీలోని ఇండియాగేట్ నుంచి పార్లమెంటు వరకు ర్యాలీ**

న్యూఢిల్లీ: దేశంలో ఈ10, ఈ20 పెట్రోల్ విక్రయాలపై తీవ్ర ఆందోళనలు, వ్యతిరేకతలు వ్యక్తం అవుతున్నాయి. ఈ పెట్రోల్ కారణంగా వాహనాల మైలేజీ తగ్గిపోతోందని.. రిపేర్ సమస్యలు వస్తున్నాయని వాహనదారులు గగ్గోలు పెడుతున్నారు. అయితే ఇథనాల్ కలిపిన పెట్రోల్ వినియోగించడం వల్ల ఎలాంటి ఇబ్బందులు లేవని కేంద్ర ప్రభుత్వం తేల్చి చెబుతోంది. ఈ నేపథ్యంలోనే తాజాగా టీమ్ భారత్ అనే సంస్థ శాంతియుత ఉద్యమానికి నడుం బిగించింది. ఇంధన విధానంలో పారదర్శకత, వినియోగదారుల ఎంపిక హక్కు, జవాబుదారీతనం కోసం పనిచేస్తున్న పౌరుల వేదిక అయిన టీమ్ భారత్.. జూలై 31వ తేదీన 'గాడీ మార్చ్, గాంధీ మార్చ్' పేరుతో శాంతియుత వాహన ర్యాలీ నిర్వహించనున్నట్లు ప్రకటించింది. ఢిల్లీలోని ఇండియా గేట్ నుంచి ప్రారంభమయ్యే ఈ గాడీ మార్చ్, గాంధీ మార్చ్ ర్యాలీ కేంద్రమంత్రులు నితిన్ గడ్కరీ, హర్దీప్ సింగ్ పురి నివాసాలు, ఆఫీసుల గుండా వెళ్లి పార్లమెంట్ స్ట్రీట్ వద్ద ముగియనుందని పేర్కొన్నారు. టీమ్ భారత్ సంస్థ విడుదల చేసిన ప్రకటన ప్రకారం.. ఇది కేంద్ర ప్రభుత్వంతో ఘర్షణకు దిగే నిరసన కాదని తేల్చి చెప్పింది. దేశంలో ఇథనాల్ 20 (ఈ20 పెట్రోల్) ఇంధన విధాన అమలుపై వాహనదారుల్లో నెలకొన్న ఆందోళనలను శాంతియుతంగా వ్యక్తం చేసే పౌరుల ఉద్యమం అని పేర్కొంది. ఈ ర్యాలీలో పాల్గొనేవారు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ.. ఇంధన విధానానికి సంబంధించిన అంశాలపైనే తమ అభిప్రాయాలు వ్యక్తం చేయాలని విజ్ఞప్తి చేసింది.

## ఒక్క రాజీనామాతో దేశాన్ని నిర్మించలేం

**సంస్కరణలు కావాలి: సోనమ్ వాంగ్‌చుక్**



న్యూఢిల్లీ: కాక్రోచ్ జనతా పార్టీ డిమాండ్లకు కేంద్ర ప్రభుత్వం అంగీకరించడాన్ని ప్రముఖ సామాజికవేత్త సోనమ్ వాంగ్‌చుక్ స్వాగతించారు. ఈ సందర్భంగా సీజేపీ బృందానికి, వారి మద్దతుదారులకు అభినందనలు తెలుపుతూ ఇది 'ప్రజాస్వామ్య విజయం' అని ఆయన పేర్కొన్నారు. జూన్ 6న ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ప్రారంభమైన ఈ నిరసన.. జూన్ 28న వాంగ్‌చుక్ ఆమరణ నిరాహార దీక్ష చేపట్టడంతో మరింత ఉధృతమైంది. 26 రోజుల సుదీర్ఘ దీక్ష అనంతరం గురువారం రాత్రి ఆయన తన నిరాహార దీక్షను విరమించారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసిన అనంతరం సెంట్రల్ ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జరుగుతున్న నిరసనను తక్షణమే విరమిస్తున్నట్లు సీజేపీ ప్రకటించింది. విద్యార్థులపై నమోదైన ఎఫ్ఐఆర్‌ల రద్దు, నీట్ పేపర్ లీక్ వల్ల ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు పరిహారం అందించడం సహా తమ డిమాండ్లను నెరవేరుస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిందని సీజేపీ అధికార ప్రతినిధి సౌరవ్ దాస్ తెలిపారు. "ప్రభుత్వం, ధర్మేంద్ర ప్రధాన్ తీసుకున్న చర్యలను నేను స్వాగతిస్తున్నాను, గౌరవిస్తున్నాను. దేశప్రజలందరికీ అభినందనలు. ఈ రోజు మనం చూసింది ప్రజాస్వామ్య విజయం. ఈ అంశాన్ని మొదట లేవనెత్తిన మా సీజేపీ బృందానికి, వారికి మద్దతుగా నిలిచిన వాలంటీర్లకు, అలాగే ప్రజాస్వామ్యం కోసం నిలబడిన దేశ విద్యార్థులు, యువత, పెద్దలందరికీ నా అభినందనలు, ధన్యవాదాలు" అని వాంగ్‌చుక్ తెలిపారు. "వారందరినీ నేను గౌరవిస్తున్నాను, అన్నింటికంటే ముఖ్యంగా వారు శాంతిని కాపాడిన విధానాన్ని ఎంతో అభినందిస్తున్నాను. భవిష్యత్తులో కూడా మనం ఈ శాంతిని కాపాడుకుంటామని, ఎక్కడా ఎటువంటి పొరపాట్లు జరగవని ఆశిస్తున్నాను. మనం సంస్కరణలపై పని చేయాల్సి ఉంది. కేవలం రాజీనామాతోనే దేశ నిర్మాణం జరగదు. విద్యా వ్యవస్థలో సంస్కరణలు రావాలి, ఆ దిశగా మరింత కృషి జరగాలి. అని ఆయన అన్నారు. అంతేకాదు, 'ప్రభుత్వం ఎంత ఉదారంగా ఈ అడుగు వేసిందో, అదే ఉదారత సంస్కరణల ప్రయత్నాల్లో కూడా కనిపిస్తుందని ఆశిస్తున్నాను.. కేవలం విద్యా వ్యవస్థలోనే కాకుండా పాలనలో కూడా సంస్కరణలు రావాలి.. ఇప్పటి నుంచి దేశాన్ని నడిపించే విధానం మారుతుందని భావిస్తున్నాను.

## బెంగాల్‌లో ఐదుగురు పోలీసులపై వేటు

**సువేందు సర్కార్ కీలక నిర్ణయం**

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి సువేందు అధికారి నేతృత్వంలోని ప్రభుత్వం ఒక కీలక నిర్ణయం తీసుకుంది. గతంలో మమతా బెనర్జీ నాయకత్వంలోని తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) పాలనలో వివాదాస్పదంగా, పక్షపాత వైఖరితో వ్యవహరించారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న ఐదుగురు పోలీసు అధికారులను సస్పెండ్ చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. శనివారం రాష్ట్ర అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల ముగింపు రోజున ముఖ్యమంత్రి ఈ విషయాన్ని వెల్లడించారు. సస్పెన్షన్‌కు గురైన వారిలో ఐపీఎస్ అధికారి కోటేశ్వరరావు కూడా ఉన్నారు. గతంలో డైమండ్ హార్బర్ ఎస్పీగా విధులు నిర్వర్తించిన ఈయన, టీఎంసీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ అభిషేక్ బెనర్జీకి అత్యంత సన్నిహితుడని సమాచారం. వీరితో పాటు కాళీయాగంజ్ పోలీస్ స్టేషన్ మాజీ ఇన్‌స్పెక్టర్ మొఅజ్జం హుస్సేన్, బర్తాలా పోలీస్ స్టేషన్ మాజీ ఆఫీసర్-ఇన్-చార్జ్ సుబర్ణ దత్తా చౌదరి, అదే స్టేషన్‌కు చెందిన ఎస్సై సాధన్ పాండే, కృష్ణానగర్ పోలీస్ స్టేషన్ మాజీ ఇన్‌స్పెక్టర్ అమలేందు బిస్వాస్‌లపై వేటు పడింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి సువేందు అధికారి మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో పోలీసు వ్యవస్థను అనేక చోట్ల దుర్వినియోగం చేశారని, సనాతన ధర్మాన్ని అనుసరించేవారి మనోభావాలను దెబ్బతీశారని విమర్శించారు. 'జీరో టాలరెన్స్' విధానాన్ని కఠినంగా అమలు చేస్తుందని ఆయన ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు.

లయ్యారి చిత్రం


షమా సికిందర్

# త్వరలో రజనీకాంత్ బయోపిక్?



భారతీయ సినిమా గర్వించదగ్గ నటుల్లో ఒకరైన సూపర్ స్టార్ రజనీకాంత్ జీవితం ఓ స్ఫూర్తిదాయక ప్రయాణం. బెంగుళూరులో ఒక సాధారణ బస్ కండక్టర్‌గా జీవితాన్ని ప్రారంభించి, అంచెలంచెలుగా ఎదిగి ప్రపంచవ్యాప్తంగా అభిమానులను సంపాదించుకున్నారు. దశాబ్దాలుగా కోట్లాది మందికి ప్రేరణగా నిలుస్తున్న ఆయన జీవిత కథ త్వరలో సినిమాగా రానుందనే వార్తలు ఆసక్తిని రేపుతున్నాయి. కొంతకాలంగా రజనీకాంత్ తన ఆత్మకథ (ఆటోబయోగ్రఫీ) రాస్తున్నట్లు ప్రచారం జరుగుతుండగా, ఇప్పుడు దానిని బయోపిక్‌గా తెరకెక్కించే అవకాశాలు ఉన్నాయని కొత్త నివేదికలు వెల్లడిస్తున్నాయి.

తాజా మీడియా కథనాల ప్రకారం.. రజనీకాంత్ తన ఆత్మకథను సినిమాగా మార్చే విషయంపై సన్నిహితులతో చర్చిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ ఆత్మకథలో ఆయన జీవితంలోని ముఖ్యమైన ఘట్టాలు, వృత్తిపరమైన విజయాలు, ఎదుర్కొన్న సవాళ్లు, మరపురాని క్షణాలను సమగ్రంగా పొందుపరచనున్నారని సమాచారం. ఈ పుస్తకాన్ని బయోపిక్‌గా తీస్తే ఎలా ఉంటుందనే దానిపై చర్చలు జరుగుతున్నప్పటికీ, దీనిపై ఇంకా అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. ప్రస్తుతం ఈ వార్త కోలీవుడ్‌లో జోరుగా ప్రచారంలో ఉంది. గతంలో రజనీకాంత్ కుమార్తె సౌందర్య కూడా తన తండ్రి ఆత్మకథ రాస్తున్న విషయాన్ని ధ్రువీకరించారు. "కష్టపడి తనకంటూ ఒక మార్గాన్ని సృష్టించుకున్న మా తలైవా, బెంగుళూరులో బస్ కండక్టర్‌గా తన పోరాటాల నుంచి కోలీవుడ్‌లో సూపర్‌స్టార్‌గా ఎదిగే వరకు తన జీవిత చరిత్రను రాయడం ప్రారంభించారు" అని ఆమె ఓ ఇంటర్వ్యూలో తెలిపారు. ఈ పుస్తకం ఆయన జీవితం, కెరీర్‌కు సంబంధించిన పూర్తి వివరాలను అందిస్తుందని, ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తుందని సౌందర్య విశ్వాసం వ్యక్తం చేశారు. ఐదు దశాబ్దాలకు పైగా సాగిన తన సినీ ప్రస్థానంలో రజనీకాంత్ తమిళం, తెలుగు, హిందీ, కన్నడ భాషల్లో ఎన్నో అద్భుతమైన చిత్రాల్లో నటించారు. భారత ప్రభుత్వం ఆయనను పద్మభూషణ్, పద్మవిభూషణ్, దాదాసాహెబ్ ఫాల్కే వంటి అత్యున్నత పురస్కారాలతో సత్కరించింది. ప్రస్తుతం ఆయన నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వంలో 'జైలర్ 2' చిత్రంలో నటిస్తున్నారు. ఈ సినిమా అక్టోబర్ 15న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. దీంతో పాటు అశ్వత్ మారిముత్తు దర్శకత్వంలో 'ధర్మాన్' అనే మరో చిత్రంలో కూడా ఆయన నటిస్తున్నారు.



## దర్శకుడిగా సుధీర్ బాబు!



టాలీవుడ్ హీరోలు.. నిర్మాతలుగా, డైరెక్టర్లుగా మారుతూ ట్రెండ్ సెట్ చేస్తున్నారు. ఇప్పటికే రామ్ పోతినేని, కిరణ్ అబ్బవరం తమ తదుపరి సినిమాలకు దర్శకత్వం వహిస్తుండగా.. తాజాగా ఆ లిస్టులో హీరో సుధీర్ బాబు చేరిపోయాడు. నటుడిగా, నిర్మాతగా ఇండస్ట్రీలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న సుధీర్ బాబు, త్వరలో దర్శకుడిగా మెగా ఫోన్ పట్టబోతున్నాడు. ఈ మేరకు దర్శకుడిగా మారి ఒక డ్రీమ్ ప్రాజెక్టును తెరకెక్కించడానికి సిద్ధమవుతున్నాడట. గత కొంత కాలంగా ఒక విభిన్నమైన కథాంశంపై పని చేస్తున్న ఆయన.. కథ మీద నమ్మకంతో ఆయనే దర్శకత్వం బాధ్యతలు తీసుకోవాలని నిర్ణయించుకున్నారని టాలీవుడ్ వర్గాల నుంచి సమాచారం.

## మా అబ్బాయిని ఆదరించండి

ఘట్టమనేని కుటుంబం నుంచి మరో హీరో వెండితెరకు పరిచయం అవుతున్న వేళ, సూపర్ స్టార్ మహేశ్ బాబు తన పూర్తి మద్దతు ప్రకటించారు. తన అన్నయ్య రమేశ్ బాబు కుమారుడు జయకృష్ణ హీరోగా నటిస్తున్న 'శ్రీనివాస మంగాపురం' సినిమా కోసం మహేశ్ ఒక ప్రత్యేక వీడియోను తన సోషల్ మీడియాలో విడుదల చేశారు. తన అబ్బాయ్ జయకృష్ణను ఆశీర్వదించాలని ఆయన అభిమానులను కోరారు.



ఈ వీడియోలో మహేశ్ బాబు మాట్లాడుతూ.. "మా అన్నయ్య అబ్బాయి జయకృష్ణ నటుడిగా పరిచయం అవుతుండటం చాలా ఆనందంగా ఉంది. మా కుటుంబమంతా ఎంతో ఎగ్జైటింగ్ గా ఎదురుచూస్తోంది. సినిమా టీజర్, ట్రైలర్, పాటలు అన్నీ బాగున్నాయి. జయకృష్ణ, రాషా థడానీ జంట చూడముచ్చటగా ఉంది. వారిని అందంగా చూపించిన దర్శకుడు అజయ్ భూపతికి నా అభినందనలు" అని అన్నారు. ఈ సందర్భంగా సినిమాకు సంబంధించిన ఒక ఆసక్తికరమైన విషయాన్ని మహేశ్ పంచుకున్నారు. "ఈ సినిమా జులై 30న విడుదలవుతోంది. అదే రోజు నా మొదటి సినిమా 'రాజకుమారుడు' కూడా విడుదలైంది. నిర్మాత అశ్వినీదత్ గారే ఈ డేట్ ప్లాన్ చేసి ఉంటారని అనుకుంటున్నాను. వైజయంతి సంస్థ నుంచి నేను, రామ్ చరణ్, అల్లు అర్జున్ వచ్చాం. ఇప్పుడు జయకృష్ణ, రాషా కూడా అదే బ్యానర్ నుంచి వస్తున్నారు. ఇది వాళ్ల అదృష్టం. మా నాన్నగారి అభిమానులు, నా అభిమానులు జయకృష్ణ, రాషాలను ఆదరించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను" అని మహేశ్ తెలిపారు.




## చిట్టిబాబుగా వెంకటేశ్

విక్టరీ వెంకటేశ్, దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్‌లో ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న కొత్త చిత్రం నుంచి కీలక అప్‌డేట్ వచ్చింది. 'ఆదర్శ కుటుంబం హౌస్ నెం: 47- ఏకే 47' అనే టైటిల్‌తో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో వెంకీ పోషిస్తున్న పాత్ర పేరును మేకర్స్ తాజాగా వెల్లడించారు. ఈ సినిమాలో ఆయన 'చిట్టి బాబు' అనే పాత్రలో ప్రేక్షకులను అలరించనున్నారు. ఈ విషయాన్ని నిర్మాణ సంస్థ హారిక అండ్ హాసిని క్రియేషన్స్ సోషల్ మీడియా 'ఎక్స్' వేదికగా ప్రకటించింది. రేపటి నుంచి సినిమాలోని ఒక్కో పాత్రను పరిచయం చేయబోతున్నట్లు తెలిపింది. ఇందులో భాగంగా వెంకటేశ్‌ను చిట్టి బాబుగా, హీరోయిన్ శ్రీనిధి శెట్టిని స్వర్ణగా, ఇతర నటులు యువీన పార్థవిని సంపూర్ణగా, రాజా ప్రజ్వల్‌ను సర్వగా పరిచయం చేయనున్నట్లు పేర్కొంది. ఇటీవలే నటుడు నారా రోహిత్ పుట్టినరోజు సందర్భంగా, ఆయన ఈ సినిమాలో నటిస్తున్నట్లు ప్రకటించింది. దీనికి సంబంధించి ఓ ప్రత్యేక పోస్టర్‌ను కూడా విడుదల చేయగా, అందులో ఆయన పోలీస్ అధికారి పాత్రలో కనిపించనున్నట్లు తెలుస్తోంది.




## 'టాక్సిక్' కౌంట్‌డౌన్.. పోస్టర్ రిలీజ్

'కేజీఎఫ్' సిరీస్‌తో పాన్ ఇండియా స్టార్‌గా ఎదిగిన రాకింగ్ స్టార్ యశ్, తన తదుపరి చిత్రం 'టాక్సిక్'తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. సినిమా విడుదలకు సరిగ్గా నెల రోజుల సమయం ఉన్న నేపథ్యంలో, చిత్ర బృందం యశ్ ఇంటెన్స్ లుక్‌తో కూడిన ఓ కొత్త పోస్టర్‌ను విడుదల చేసింది. ఈ పోస్టర్ ప్రస్తుతం సోషల్ మీడియాలో ట్రెండింగ్‌లో ఉంది. తాజాగా విడుదలైన ఈ పోస్టర్‌లో యశ్ స్టైలిష్‌గా, అంతే క్రూరంగా కనిపిస్తున్నారు. రక్తంతో తడిసిన చేతులతో, ప్రశాంతంగా సిగరెట్ కాలుస్తూ ఇంటెన్స్ లుక్‌తో ఆకట్టుకుంటున్నారు. ఈ లుక్ సినిమాలోని హింసాత్మక ప్రపంచాన్ని సూచిస్తున్నప్పటికీ, కథపై ఎలాంటి క్లారిటీ ఇవ్వకుండా ఉత్కంఠను పెంచుతోంది. "అతని చేతులకు రక్తం అంటింది" అనే క్యాప్షన్‌తో మేకర్స్ ఈ పోస్టర్‌ను పంచుకున్నారు. 'టాక్సిక్: ఏ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్-అప్స్' అనే ట్యాగ్‌లైన్‌తో వస్తున్న ఈ చిత్రానికి గీతూ మోహన్‌దాస్ దర్శకత్వం వహిస్తున్నారు. యశ్‌తో కలిసి ఆమె ఈ కథను రాయడం విశేషం. కేవీఎన్ ప్రొడక్షన్స్ నిర్మిస్తున్న ఈ సినిమాను కన్నడ, ఇంగ్లీష్ భాషల్లో ఏకకాలంలో రూపొందించి, పలు భారతీయ భాషల్లోకి డబ్ చేయనున్నారు. యశ్‌తో పాటు నయనతార, కియారా అద్వానీ, తారా సుతారియా, హుమా ఖురేషి వంటి భారీ తారాగణం నటిస్తోంది. కేజీఎఫ్ సిరీస్ వంటి భారీ బ్లాక్‌బస్టర్ల తర్వాత యశ్ నుంచి వస్తున్న సినిమా కావడంతో 'టాక్సిక్'పై అంచనాలు ఆకాశాన్ని అంటాయి. ఈ చిత్రం ఆగస్టు 26న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.

## బల్కంపేట ఎల్లమ్మకు 'అగధ' టీం బోనం




ప్రముఖ దర్శకనిర్మాత ఎం.ఎస్. రాజు రూపొందిస్తున్న ప్రతిష్ఠాత్మక చిత్రం 'అగధ'. డివైన్ మిస్టిక్ థ్రిల్లర్‌గా తెరకెక్కుతున్న ఈ సినిమా ప్రచార కార్యక్రమాలను చిత్ర బృందం వినూత్నంగా ప్రారంభించింది. హైదరాబాద్‌లోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన బల్కంపేట ఎల్లమ్మ-పోచమ్మ అమ్మవార్ల ఆశీస్సులతో ఆదివారం 'అగధ' ప్రచార జాతరకు శ్రీకారం చుట్టింది. ఆగస్ట్ 14న ప్రపంచవ్యాప్తంగా భారీ విడుదలకు సిద్ధమవుతున్న నేపథ్యంలో, ఇవాళ చిత్ర యూనిట్ సభ్యులు బల్కంపేట ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా కథానాయిక కామాక్షి భాస్కర్ల సంప్రదాయబద్ధంగా అలంకరించుకుని, భక్తిశ్రద్ధలతో అమ్మవారికి బోనం సమర్పించారు. ఈ కార్యక్రమంలో దర్శకుడు ఎం.ఎస్. రాజు, నిర్మాత కాశీ విశాలాక్షి బలుసు, సమర్పకులు అజయ్ కేఆర్, హీరో శ్రవణ్ రెడ్డి, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ ఎన్.వి.ఎన్. సుబ్బరాజు తమ కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్మాత కాశీ విశాలాక్షి బలుసు మాట్లాడుతూ, "దేవి' చిత్రం సృష్టించిన చరిత్ర లాంటి వైబ్స్ ఇప్పుడు 'అగధ' విషయంలోనూ కనిపిస్తున్నాయి. పోస్టర్, టీజర్‌తోనే సినిమాపై అంచనాలు పెరిగాయి. ఆగస్ట్ 14న భారీ స్థాయిలో విడుదలవుతున్న మా సినిమా ప్రచార జాతర అమ్మవారి సన్నిధిలో మొదలవడం శుభసూచకం" అని



## హార్దిక్ కోసం చెన్నై భారీ ఆఫర్

ఐపీఎల్ 2027 సీజన్‌కు ముందు ముంబై ఇండియన్స్‌ను వీడనున్న స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యాను తమ జట్టులోకి తీసుకునేందుకు చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే) తీవ్రంగా ప్రయత్నిస్తోంది. అయితే, ఈ మెగా ట్రేడింగ్ వ్యవహారంలో రెండు ఫ్రాంచైజీల మధ్య ఆసక్తికరమైన బేరసారాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. హార్దిక్‌ను వదులుకునేందుకు ముంబై ఇండియన్స్ భారీ ప్యాకేజీని డిమాండ్ చేస్తుండగా, చెన్నై అందుకు భిన్నమైన ప్రతిపాదనతో ముందుకొచ్చింది. 'హిందుస్థాన్ టైమ్స్' కథనం ప్రకారం.. హార్దిక్ పాండ్యాకు బదులుగా తమకు యువ సంచలనం ఆయుశ్ మాత్రేతో పాటు విధ్వంసకర ఆల్‌రౌండర్ శివమ్ దూబేను ఇవ్వాలని ముంబై ఇండియన్స్ కోరినట్లు సమాచారం. గత ఐపీఎల్ సీజన్‌లో దాదాపు 180 స్ట్రైక్ రేట్‌తో అదరగొట్టిన 19 ఏళ్ల మాత్రేను తమ జట్టు పునర్నిర్మాణంలో భాగంగా కీలక ఆటగాడిగా ముంబై భావిస్తోంది. అందుకే అతడిని ట్రేడింగ్‌లో చేర్చాలని పట్టుబడుతోంది. అయితే, భవిష్యత్ స్టార్‌గా ఎదుగుతాడని భావిస్తున్న ఆయుష్ మాత్రేను వదులుకునేందుకు చెన్నై సూపర్ కింగ్స్ ఎంతమాత్రం సుముఖంగా లేదు. అతడిని కాపాడుకోవాలనే ఉద్దేశంతో ముంబైకి మరో ఆకర్షణీయమైన ఆఫర్‌ను ప్రతిపాదించింది. ఈ కౌంటర్ ఆఫర్‌లో భాగంగా శివమ్ దూబే, దక్షిణాఫ్రికా డైనమిక్ బ్యాటర్ డెవాల్డ్ బ్రెవిస్‌లతో పాటు అదనంగా రూ.10 కోట్ల నగదును ముంబైకి ఇచ్చేందుకు సీఎస్‌కే సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఈ ప్రతిపాదన కార్యరూపం దాల్చితే ముంబై ఇండియన్స్‌కు సుమారు రూ.20 కోట్ల విలువైన ప్రయోజనం చేకూరవచ్చు.



## రజతంతో మెరిసిన రిషికాంత సింగ్

కామన్వెల్త్ క్రీడల్లో భారత్ ఖాతాలో మరో పతకం చేరింది. వెయిట్‌లిఫ్టింగ్‌లో చనంబమ్ రిషికాంత సింగ్ రజతంతో మెరిశాడు. పురుషుల 60 కిలోల విభాగంలో సత్తా చాటిన అతడు మువ్వన్నెల జెండాను రెపరెపలాడించాడు. కామన్వెల్త్ రికార్డు నెలకొల్పిన రిషికాంత సింగ్ పసిడి వేటలో వెనకబడి.. వెండి వెలుగులు విరజిమ్మాడు. మలేషియా వెయిట్‌లిఫ్టర్ మొహమద్ అనిక్ బిన్ కస్దాన్ స్వర్ణం ఎగరేసుకుపోయాడు. రిషికాంత్, మొహమూద్‌లు.. ఇద్దరూ విజయవంతంగా 121 కిలోలు ఎత్తడం ఈ క్రీడల చరిత్రలో ఇదే మొదటిసారి. గ్లాస్గో వేదికగా జరుగుతున్న కామన్వెల్త్ క్రీడల్లో ఆదివారం భారత్‌కు మరో పతకం వచ్చింది. 'కార్గిల్ విజయ్ దివస్' రోజున వెయిట్‌లిఫ్టర్ చనంబమ్ రిషికాంత సింగ్ సిల్వర్ మెడల్ కొల్లగొట్టాడు. ఆర్మీ స్పోర్ట్స్‌లో రాటుదేలిన అతడు ఫైనల్లో మలేషియా మొహమద్ అనిక్ బిన్ కస్దాన్‌తో పోటాపోటీగా 121 కిలోల బరువులు ఎత్తాడు. అయితే.. క్లీన్ అండ్ జెర్క్ విభాగంలో మొహమూద్ మెరుగైన ప్రదర్శన చేయడంతో భారత స్టార్ వెండి పతకానికి పరిమితయ్యాడు. క్లీన్ అండ్ జెర్క్‌లో రిషికాంత 143 కిలోలు ఎత్తగా.. మలేషియా వెయిట్‌లిఫ్టర్ ఏకంగా 152 కిలోలు ఎత్తి పసిడి పతకం సాధించాడు. మొత్తంగా ఫైనల్లో రిషికాంత 264 కిలోలు, మొహమూద్ 273 కిలోల బరువులు ఎత్తి శభాష్ అనిపించుకున్నారు. వీరి తర్వాతి స్థానంలో నిలిచిన జోషువా మొబియా(కెన్యా) కాంస్యం సాధించాడు. మరోవిషయం.. 2022లో బర్మింగ్‌హమ్ ఆతిథ్యమిచ్చిన కామన్వెల్త్ క్రీడల్లో 55 కిలోల విభాగంలో పోటీపడిన రిషికాంత.. ఈసారి 60 కిలోల ఈవెంట్‌లో దేశం గర్వించే ప్రదర్శన చేశాడు.







# మీరాబాయి.. బంగారం

గ్లాస్గో వేదికగా జరుగుతున్న కామన్వెల్త్ గేమ్స్‌లో భారత వెయిట్‌లిఫ్టర్ మీరాబాయి చాను దేశానికి తొలి స్వర్ణం అందించింది. ఆదివారం జరిగిన మహిళల 48 కిలోల విభాగంలో సత్తా చాటిన మీరాబాయి అగ్రస్థానంలో పసిడి వెలుగులు విరజిమ్మింది. ఆసియా క్రీడలే తన అసలైన లక్ష్యమని, కామన్వెల్త్‌లో వందశాతం ప్రయత్నిస్తానో లేదోనని చెప్పిన ఆమె అందరి అంచనాలు అందుకుంటూ ఈ టోర్నీలో వరసగా మూడోసారి గోల్డ్‌మెడల్‌తో మురిసిపోయింది. కామన్‌వెల్త్ క్రీడల్లో వెయిట్‌లిఫ్టర్ మీరాబాయి చాను తన ఆధిపత్యాన్ని కొనసాగించింది. 2018, 2022లో పసిడి పతకం కొల్లగొట్టిన మీరాబాయి గ్లాస్గోలోనూ పట్టువదల్లేదు. ఫైనల్లో బరువులు ఎత్తిన భారత స్టార్ ఈ ఎడిషన్‌లో దేశానికి తొలి స్వర్ణం అందించింది. ఇదివరకు 82 కిలోలతో కామన్వెల్త్‌లో రికార్డు నెలకొల్పిన మీరాబాయి..క్లీన్ అండ్ జెర్క్ విభాగంలో తొలి ప్రయత్నంలో విఫలమైంది. రెండోసారి తడబడకుండా 82 కిలోలు, మూడో ప్రయత్నంలో 85 కిలోలు ఎత్తి సరికొత్త రికార్డు సాధించింది. అనంతరం 105 కిలోలను సైతం అవలీలగా ఎత్తిన మీరాబాయి పసిడి పతకంతో మువ్వన్నెల జెండాను రెపరెపలాడించింది. తద్వారా భారత్ పతకాల సంఖ్య మూడుకు చేరింది.

## వరల్డ్ జూనియర్ స్క్వాష్ విజేతగా అనహత్

భారత యువ స్క్వాష్ సంచలనం అనహత్ సింగ్ చరిత్ర సృష్టించింది. వరల్డ్ జూనియర్ స్క్వాష్ ఛాంపియన్‌షిప్‌లో విజేతగా నిలిచి, ఈ ఘనత సాధించిన తొలి భారతీయురాలిగా రికార్డులకెక్కింది. కెనడాలోని నియాగరా-ఆన్-ది-లేక్‌లో జరిగిన మహిళల ఫైనల్‌లో ఆమె ఈ చారిత్రక విజయాన్ని నమోదు చేసింది. టాప్ సీడ్, వరల్డ్ నంబర్ 20 అయిన అనహత్, ఫైనల్‌లో ఈజిప్టుకు చెందిన రెండో సీడ్ రుఖయ్యా సలేంను 11-3, 11-7, 11-9 తేడాతో వరుస గేముల్లో ఓడించింది. గత ఏడాది ఇదే టోర్నీలో కాంస్య పతకంతో సరిపెట్టుకున్న అనహత్, ఈసారి అద్భుత ప్రదర్శనతో టైటిల్‌ను కైవసం చేసుకుంది. ఈ విజయంతో 15 ఏళ్లుగా ఈ టోర్నీలో కొనసాగుతున్న ఈజిప్టు క్రీడాకారుణుల ఆధిపత్యానికి అనహత్ తెరదించింది. 2010 తర్వాత ఈ టైటిల్




గెలిచిన తొలి నాన్-ఈజిప్షియన్ ప్లేయర్‌గా కూడా ఆమె నిలిచింది. శుక్రవారం జరిగిన సెమీఫైనల్‌లో ఈజిప్టుకే చెందిన బార్బ సమీహ్‌ను ఓడించిన అనహత్, 21 ఏళ్ల తర్వాత ఈ టోర్నీ ఫైనల్‌కు చేరిన తొలి భారతీయురాలిగా నిలిచింది. "ఫైనల్‌కు చేరడం నా తల్లిదండ్రులకు, కోచ్‌లకు చాలా ఆనందాన్నిచ్చింది. కానీ టోర్నమెంట్ ఇంకా ముగియలేదు" అని సెమీస్ అనంతరం ఆమె వ్యాఖ్యానించింది. చెప్పినట్టుగానే ఫైనల్లోనూ గెలిచి తన కెరీర్‌లోనే అతిపెద్ద టైటిల్‌ను సొంతం చేసుకుంది.



# టీమిండియా క్లీన్ స్వీప్

### మూడో టీ20 కూడా మనదే .. జింబాబ్వేపై సూపర్ విక్టరీ

**జింబాబ్వే పర్యటనలో యువకులతో కూడిన భారత జట్టు అద్భుత ప్రదర్శనతో అదరగొట్టింది. మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌ను 3-0 తేడాతో క్లీన్‌స్వీప్ చేసింది. ఆదివారం హరారే స్పోర్ట్స్ క్లబ్ వేదికగా జరిగిన ఆఖరిదైన మూడో టీ20లో టీమిండియా 35 పరుగుల తేడాతో జింబాబ్వేపై ఘనవిజయం సాధించింది.**



తొలుత బ్యాటింగ్‌లో యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ (81) ఆకాశమే హద్దుగా చెలరేగగా, బౌలింగ్‌లో మయాంక్ యాదవ్ (3/29) తన పేస్‌తో ప్రత్యర్థిని కట్టడి చేశాడు. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 192 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఓపెనర్ అభిషేక్ శర్మ (2) విఫలమైనా, మరో యువ ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ విధ్వంసకర ఇన్నింగ్స్ ఆడాడు. కేవలం 49 బంతుల్లో 8 ఫోర్లు, 4 సిక్సర్లతో 81 పరుగులు చేసి జట్టు భారీ స్కోరుకు బలమైన పునాది వేశాడు. అతనికి ఇషాన్ కిషన్ (29), కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (27) నుంచి మంచి సహకారం లభించింది. చివర్లో రింకూ సింగ్ (14 బంతుల్లో 25) తనదైన శైలిలో మెరుపులు మెరిపించడంతో భారత్ భారీ స్కోరును నమోదు చేసింది. జింబాబ్వే బౌలర్లలో బ్రాడ్ ఎవాన్స్ రెండు వికెట్లు పడగొట్టాడు.

అనంతరం 193 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో జింబాబ్వే ఏ దశలోనూ గెలుపు దిశగా సాగలేదు. భారత బౌలర్ల ధాటికి క్రమం తప్పకుండా వికెట్లు కోల్పోయింది. ఓపెనర్ బెన్నెట్‌ను తొలి బంతికే మయాంక్ యాదవ్ పెవిలియన్ చేర్చాడు. ఆ తర్వాత యశ్ ఠాకూర్ ఒకే ఓవర్లో డియాన్ మైయర్స్ (19), కెప్టెన్ సికిందర్ రజా (0)లను ఔట్ చేసి జింబాబ్వేను కోలుకోలేని దెబ్బతీశాడు. ఒకవైపు వికెట్లు పడుతున్నా, రియాన్ బర్ల్ (43 బంతుల్లో 54 నాటౌట్) ఒంటరి పోరాటం చేశాడు. అతనికి వెస్లీ మధెవెరే (28) కాసేపు సహకరించినా, అది ఓటమి అంతరాన్ని తగ్గించడానికే సరిపోయింది. భారత బౌలర్లలో మయాంక్ యాదవ్ మూడు వికెట్లతో జింబాబ్వే పతనాన్ని శాసించాడు. యశ్ ఠాకూర్ రెండు వికెట్లు తీయగా, అశోక్ శర్మ, రవి బిష్ణోయ్ తలో వికెట్ పడగొట్టారు.

నేటి ఈవార్తలు

సంపాదకీయం Editorial

## ఇంధన భద్రత.. దిగుమతులు

దేశ ఆర్థిక వ్యవస్థ బలంగా ఉండాలంటే పరిశ్రమలు నడవాలి. పరిశ్రమలు నడవాలంటే ఇంధనం అందుబాటులో ఉండాలి. ఆధునిక ప్రపంచంలో ఇంధనం కేవలం ఒక వనరు మాత్రమే కాదు; అది దేశ అభివృద్ధిని, ఆర్థిక వృద్ధిని, జాతీయ భద్రతను నిర్ణయించే వ్యూహాత్మక శక్తి. చమురు, సహజ వాయువు, బొగ్గు, విద్యుత్.. ఈ నాలుగు రంగాలపైనే ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ఆధారపడి ఉంది. అయితే భారత్ వంటి వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశానికి ఒక పెద్ద సవాలు ఎదురవుతోంది. అదే ఇంధన దిగుమతులపై అధిక ఆధారపడటం. భారత్ ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థల్లో ఒకటి. పారిశ్రామికీకరణ, పట్టణీకరణ, వాహనాల సంఖ్య పెరగడం, విద్యుత్ వినియోగం విస్తరించడం వంటి కారణాలతో ఇంధన అవసరాలు ప్రతి ఏడాది పెరుగుతున్నాయి. అయితే మన దేశంలో ఉత్పత్తి అయ్యే ముడి చమురు దేశ అవసరాలకు చాలడం లేదు. ఫలితంగా దేశ అవసరాల్లో ఎక్కువ భాగాన్ని విదేశాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది. ఈ పరిస్థితి భారత్‌ను అంతర్జాతీయ మార్కెట్ ఒడిదుడుకులకు గురిచేస్తోంది. ఇంధన దిగుమతులపై అధిక ఆధారపడటం వల్ల మొదట ప్రభావితమయ్యేది దేశ విదేశీ మారక నిల్వలు. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు పెరిగితే దిగుమతుల బిల్లు కూడా భారీగా పెరుగుతుంది. దాంతో వాణిజ్య లోటు పెరిగి రూపాయి విలువపై ఒత్తిడి ఏర్పడుతుంది. చమురు ధరలు పెరిగినప్పుడు పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్, విమాన ఇంధనం, ఎరువుల తయారీ ఖర్చు, రవాణా వ్యయం.. ఇలా ప్రతి రంగంపై ప్రభావం పడుతుంది. చివరికి ద్రవ్యోల్బణం పెరిగి సామాన్య ప్రజల జీవన వ్యయం అధికమవుతుంది. 2022లో రష్యా-ఉక్రెయిన్ యుద్ధం ప్రపంచానికి ఒక కీలక పాఠం నేర్పింది. యుద్ధం కారణంగా చమురు, సహజ వాయువు సరఫరాలో అంతరాయాలు ఏర్పడి ప్రపంచ మార్కెట్లు కుదేలయ్యాయి. అనేక దేశాల్లో ఇంధన ధరలు ఒక్కసారిగా పెరిగాయి. యూరప్‌లో విద్యుత్ సంక్షోభం తలెత్తింది. ఈ పరిణామాలు ఒక విషయాన్ని స్పష్టం చేశాయి. ఇంధన భద్రత అనేది కేవలం ఆర్థిక అంశం కాదు; అది జాతీయ భద్రతకు సంబంధించిన వ్యూహాత్మక అవసరం. పశ్చిమాసియా దేశాల్లో ఏర్పడే రాజకీయ ఉద్రిక్తతలు, సముద్ర మార్గాల్లో అంతరాయాలు, అంతర్జాతీయ ఆంక్షలు, ఉత్పత్తి తగ్గింపు నిర్ణయాలు వంటి అంశాలు కూడా చమురు ధరలను ప్రభావితం చేస్తుంటాయి. ఈ పరిస్థితుల్లో దిగుమతులపై అధికంగా ఆధారపడే దేశాలు ఎక్కువ ప్రమాదాన్ని ఎదుర్కొంటాయి. అందుకే ప్రపంచంలోని అనేక దేశాలు ఇప్పుడు ఇంధన వైవిధ్యీకరణ వైపు అడుగులు వేస్తున్నాయి. భారత్ కూడా ఈ దిశగా అనేక చర్యలు చేపడుతోంది. సౌరశక్తి, పవన విద్యుత్, జలవిద్యుత్, అణు విద్యుత్, బయోఫ్యూయల్స్, గ్రీన్ హైడ్రోజన్ వంటి ప్రత్యామ్నాయ ఇంధన వనరులను ప్రోత్సహిస్తోంది. ప్రపంచంలోనే అతిపెద్ద పునరుత్పాదక ఇంధన కార్యక్రమాల్లో భారత్ ఒకటిగా నిలుస్తోంది. సౌర విద్యుత్ ఉత్పత్తిలో గణనీయమైన పురోగతి సాధించింది. గ్రామీణ ప్రాంతాల్లో కూడా సోలార్ పంపులు, రూఫ్‌టాప్ సోలార్ వ్యవస్థలు విస్తరిస్తున్నాయి. ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం కూడా ఇంధన భద్రతలో కీలక పాత్ర పోషిస్తుంది. పెట్రోల్, డీజిల్ వినియోగం తగ్గితే దిగుమతులపై ఆధారపడటం కూడా తగ్గుతుంది. అయితే దీనికి అవసరమైన బ్యాటరీ తయారీ, ఛార్జింగ్ మౌలిక సదుపాయాలు, విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం కూడా సమాంతరంగా పెరగాలి. భారత్ ఇథనాల్ మిశ్రమ పెట్రోల్ కార్యక్రమాన్ని వేగంగా అమలు చేస్తోంది. చెరకు, మొక్కజొన్న వంటి పంటల నుంచి తయారయ్యే ఇథనాల్‌ను పెట్రోల్‌లో కలపడం ద్వారా చమురు దిగుమతులను కొంతవరకు తగ్గించవచ్చు. దీని వల్ల రైతులకు కొత్త మార్కెట్ లభించడంతో పాటు విదేశీ మారక వ్యయం కూడా తగ్గే అవకాశం ఉంటుంది. సహజ వాయువు వినియోగాన్ని పెంచడం కూడా మరో ముఖ్యమైన వ్యూహం. పైప్‌లైన్ నెట్‌వర్క్ విస్తరణ, సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్, సీఎన్‌జీ వినియోగం, ఎల్‌ఎన్‌జీ టెర్మినల్స్ అభివృద్ధి ద్వారా పరిశుభ్రమైన ఇంధన వినియోగం పెరుగుతోంది. అయితే దీంట్లో కూడా దిగుమతులపై ఆధారపడకుండా దేశీయ అన్వేషణ, ఉత్పత్తిని ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది. తెలుగు రాష్ట్రాలకు కూడా ఈ రంగంలో మంచి అవకాశాలు ఉన్నాయి. తెలంగాణలో సౌర విద్యుత్ విస్తరణకు అనుకూల పరిస్థితులు ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో సౌర, పవన విద్యుత్ ఉత్పత్తికి విస్తారమైన అవకాశాలు ఉన్నాయి. తీరప్రాంతాల్లో ఆఫ్‌షోర్ విండ్ ఎనర్జీ, గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్టులు, పంప్డ్ స్టోరేజ్ విద్యుత్ ప్రాజెక్టులు అభివృద్ధి చేస్తే దక్షిణ భారతదేశంలో స్వచ్ఛ ఇంధన కేంద్రాలుగా ఎదిగే అవకాశం ఉంది.

# నైపుణ్యాలే సంపద

**65 శాతం కంటే ఎక్కువ జనాభా పని చేసే వయస్సులో ఉండటం భారతదేశానికి అపారమైన అవకాశంగా ప్రపంచం చూస్తోంది. ఈ జనాభాను "డెమోగ్రాఫిక్ డివిడెండ్"గా అభివర్ణిస్తారు. కానీ ఇదే యువశక్తి ఉపాధి లేక, సరైన నైపుణ్యాలు లేక నిరాశలోకి జారిపోతే అది దేశానికి వరం కాకుండా భారంగా మారే ప్రమాదం ఉంది. నేడు భారతదేశం ఎదుర్కొంటున్న అతిపెద్ద సవాళ్లలో ఒకటి యువత, నిరుద్యోగం, పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాల మధ్య పెరుగుతున్న అంతరం. ప్రతి ఏడాది లక్షలాది మంది విద్యార్థులు పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాల నుంచి డిగ్రీలు పూర్తి చేసి బయటకు వస్తున్నారు. కానీ వారిలో గణనీయమైన సంఖ్యలో యువతకు తగిన ఉద్యోగాలు దొరకడం లేదు. మరోవైపు పరిశ్రమలు మాత్రం "అవసరమైన నైపుణ్యాలు ఉన్న అభ్యర్థులు దొరకడం లేదు" అని చెబుతున్నాయి. ఒకవైపు ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న యువత... మరోవైపు ఖాళీగా ఉన్న ఉద్యోగాలు. ఈ వైరుధ్యమే నైపుణ్యాల అంతరానికి నిదర్శనం.**

ఈ సమస్యకు ప్రధాన కారణం విద్యా వ్యవస్థ మరియు పరిశ్రమల అవసరాల మధ్య సమన్వయం లేకపోవడం. అనేక కోర్సులు ఇప్పటికీ పాత సిలబస్‌తో కొనసాగుతున్నాయి. ఉద్యోగ మార్కెట్ వేగంగా మారుతుంటే విద్యా విధానం అదే వేగంతో మారడం లేదు. ఫలితంగా డిగ్రీ పూర్తి చేసిన యువకుడు సిద్ధాంతపరంగా అర్హత సాధించినప్పటికీ, ఆచరణలో ఉద్యోగానికి అవసరమైన నైపుణ్యాలను కలిగి ఉండకపోవచ్చు. ప్రపంచం ఇప్పుడు కృత్రిమ మేధ, డేటా అనలిటిక్స్, సైబర్ సెక్యూరిటీ, క్లౌడ్ కంప్యూటింగ్, సెమీకండక్టర్ తయారీ, రోబోటిక్స్, ఆటోమేషన్, గ్రీన్ ఎనర్జీ, డిజిటల్ మార్కెటింగ్ వంటి కొత్త రంగాల వైపు వేగంగా అడుగులు వేస్తోంది. కానీ అనేక మంది యువత ఇప్పటికీ మార్కెట్‌లో డిమాండ్ తగ్గిన కోర్సులకే పరిమితమవుతున్నారు. ఫలితంగా ఉద్యోగ అవకాశాలు ఉన్న రంగాలు ఒకవైపు, ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న అభ్యర్థులు మరోవైపు నిలిచిపోయే పరిస్థితి ఏర్పడుతోంది. నైపుణ్యాలు అంటే కేవలం సాంకేతిక పరిజ్ఞానం మాత్రమే కాదు. కమ్యూనికేషన్ నైపుణ్యం, సమస్యలను పరిష్కరించే సామర్థ్యం, జట్టుగా పనిచేసే స్వభావం, నాయకత్వ లక్షణాలు, సమయపాలన, డిజిటల్ అవగాహన, కొత్త విషయాలను నేర్చుకునే తత్వం వంటి సాఫ్ట్ స్కిల్స్ కూడా నేటి ఉద్యోగ ప్రపంచంలో అత్యంత కీలకంగా మారాయి. అనేక సంస్థలు ఉద్యోగ అభ్యర్థులను ఎంపిక చేసే సమయంలో ఈ నైపుణ్యాలకే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నాయి.

నిరుద్యోగానికి మరో కారణం ఉద్యోగాలపై ఉన్న సామాజిక దృక్పథం. ఇంకా చాలా మంది యువత ప్రభుత్వ ఉద్యోగమే శాశ్వత పరిష్కారమని భావిస్తున్నారు. ప్రభుత్వ ఉద్యోగాలకు ప్రాధాన్యం ఉండటం సహజమే. కానీ ప్రతి యువకుడికి ప్రభుత్వ ఉద్యోగం లభించడం సాధ్యం కాదు. ప్రైవేట్ రంగం, స్టార్టప్‌లు, స్వయం ఉపాధి, వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు, డిజిటల్ సేవలు, సృజనాత్మక రంగాలు కూడా ఉపాధికి పెద్ద వేదికలుగా





మారుతున్నాయి. ఉపాధి అంటే ఉద్యోగం మాత్రమే కాదు; ఉపాధి సృష్టించడం కూడా ఒక అవకాశమే అనే దృక్పథం పెరగాలి. గ్రామీణ యువత పరిస్థితి మరింత ప్రత్యేకమైనది. వ్యవసాయం మీద ఆధారపడే కుటుంబాల్లో చదువుకున్న యువత నగరాలకు వలస వెళ్తున్నారు. కానీ అందరికీ ఆశించిన ఉద్యోగాలు దొరకడం లేదు. ఫలితంగా నిరుద్యోగం, తాత్కాలిక ఉపాధి, ఆర్థిక అస్థిరత వంటి సమస్యలు పెరుగుతున్నాయి. గ్రామాల్లోనే ఆహార ప్రాసెసింగ్, హస్తకళలు, పాడి పరిశ్రమ, డిజిటల్ సేవలు, పర్యాటకం, గ్రామీణ స్టార్టప్‌లను ప్రోత్సహిస్తే స్థానికంగానే ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. తెలుగు రాష్ట్రాల్లో ఐటీ, ఫార్మా, ఎలక్ట్రానిక్స్, ఏరోస్పేస్, డేటా సెంటర్లు, లాజిస్టిక్స్, ఫుడ్ ప్రాసెసింగ్ వంటి రంగాలు వేగంగా అభివృద్ధి చెందుతున్నాయి. హైదరాబాద్ ఇప్పటికే ప్రపంచ ఐటీ కేంద్రాల్లో ఒకటిగా గుర్తింపు పొందింది. విశాఖపట్నం, తిరుపతి, వరంగల్ వంటి నగరాల్లో కూడా కొత్త పరిశ్రమలు విస్తరిస్తున్నాయి. ఈ అవకాశాలకు అనుగుణంగా విద్యార్థులను సిద్ధం చేయగలిగితే నిరుద్యోగ సమస్యను గణనీయంగా తగ్గించవచ్చు.

స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాలు ఈ దిశలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. అయితే శిక్షణ ఇవ్వడం మాత్రమే కాదు; ఆ శిక్షణ ఉద్యోగానికి దారితీయాలి. పరిశ్రమలతో భాగస్వామ్యంగా ఇంటర్న్‌షిప్‌లు, అప్రెంటిస్‌షిప్‌లు, ఆన్-ది-జాబ్ ట్రైనింగ్, పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా కోర్సుల రూపకల్పన జరగాలి. "నేర్చుకో - పని చేయి - సంపాదించు" అనే నమూనా మరింత విస్తరించాలి. విద్యాసంస్థలు కూడా మారాల్సిన సమయం వచ్చింది. పరీక్షల్లో మార్కులు సాధించడం ఒక్కటే లక్ష్యం కాకూడదు. ప్రాజెక్టులు, పరిశోధన, ప్రాక్టికల్ లెర్నింగ్, పరిశ్రమల సందర్శనలు, స్టార్టప్ ఇంక్యుబేషన్ కేంద్రాలు, కెరీర్ కౌన్సెలింగ్ వంటి అంశాలను విద్యలో భాగం చేయాలి. నాలుగేళ్ల డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థి ఉద్యోగానికి సిద్ధంగా ఉండేలా విద్యా వ్యవస్థ రూపుదిద్దుకోవాలి. తల్లిదండ్రుల దృక్పథం కూడా మారాలి. ప్రతి విద్యార్థి డాక్టర్, ఇంజినీర్, ప్రభుత్వ ఉద్యోగి కావాల్సిన అవసరం లేదు. ప్రతి ఒక్కరి ఆసక్తి, సామర్థ్యం వేరు. నైపుణ్యాధారిత విద్య, వృత్తి విద్య, టెక్నికల్ ట్రైనింగ్, డిజిటల్ నైపుణ్యాలకు కూడా సమాన గౌరవం ఇవ్వాలి. ప్రపంచంలోని అనేక అభివృద్ధి చెందిన దేశాలు వృత్తి విద్యను బలోపేతం చేయడం ద్వారానే ఉపాధి సమస్యలను అధిగమించాయి. యువత కూడా ఉద్యోగం కోసం ఎదురుచూడడమే కాకుండా నిరంతరం నేర్చుకునే అలవాటు పెంపొందించుకోవాలి. సాంకేతికత వేగంగా మారుతున్న ఈ కాలంలో ఒకసారి నేర్చుకున్న విద్య జీవితాంతం సరిపోదు. కొత్త నైపుణ్యాలు నేర్చుకోవడం, ఆన్‌లైన్ కోర్సులు చేయడం, ఇంటర్న్‌షిప్‌లు, ఫ్రీలాన్సింగ్, భాషా నైపుణ్యాలు పెంపొందించుకోవడం వంటి అంశాలపై దృష్టి పెట్టాలి.

భారతదేశం 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా మారాలంటే యువశక్తిని సరైన దిశలో ఉపయోగించుకోవాలి. నిరుద్యోగం సమస్యను కేవలం ఉద్యోగాల సంఖ్య పెంచడం ద్వారా మాత్రమే పరిష్కరించలేం. ఉద్యోగాలకు అవసరమైన నైపుణ్యాలను పెంపొందించడం, విద్యను పరిశ్రమలకు అనుసంధానం చేయడం, స్వయం ఉపాధిని ప్రోత్సహించడం, ఆవిష్కరణలకు ప్రాధాన్యం ఇవ్వడం వంటి సమగ్ర చర్యలు అవసరం. యువత దేశానికి భవిష్యత్తు మాత్రమే కాదు; వర్తమాన అభివృద్ధికి కూడా చోదకశక్తి. చేతిలో డిగ్రీ ఉండటం సరిపోదు; ప్రపంచంతో పోటీ పడే నైపుణ్యం కూడా ఉండాలి. ఉద్యోగాల కోసం మాత్రమే ఎదురుచూసే యువత కంటే, అవకాశాలను సృష్టించే యువత దేశాన్ని ముందుకు నడిపిస్తుంది. విద్య, నైపుణ్యం, ఆత్మవిశ్వాసం, ఆవిష్కరణ.. ఈ నాలుగు కలిసి నడిచినప్పుడే నిరుద్యోగం తగ్గి, భారత యువశక్తి ప్రపంచానికి ఆదర్శంగా నిలుస్తుంది.



చుక్కల శ్రీకాంత్
ఐటీ నిపుణుడు, నిజామాబాద్



# పరీక్షలు.. విద్యార్థులకు 'పరీక్ష'!

**ప్రశ్నపత్రం లీకైతే పోయేది కాగితం కాదు..
లక్షల మంది యువత భవిష్యత్తు..
ఒక లీకేజీతో నేరస్థులు కోట్లు గడిస్తే..
నిజాయతీగా చదివిన విద్యార్థికి మిగిలేది నిరాశే..
అందుకే కఠిన శిక్షలు అవసరం.. అంతకంటే
అవసరమైనది లీకేజీకి తావులేని పరీక్ష వ్యవస్థ..
చట్టం నేరస్థుడిని శిక్షిస్తుంది.. సాంకేతికత
నేరానికి అవకాశాన్నే మూసేస్తుంది..**

దేశవ్యాప్తంగా వరుసగా వెలుగుచూస్తున్న ప్రశ్నపత్రాల లీకేజీలు పరీక్షా వ్యవస్థపై విద్యార్థుల విశ్వాసాన్ని దెబ్బతీశాయి. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం పబ్లిక్ పరీక్షల (అక్రమ పద్ధతుల నివారణ) చట్టం--2024'ను మరింత కఠినతరం చేస్తూ దోషులకు 10 ఏళ్ల వరకు జైలు శిక్ష, రూ.10 కోట్ల వరకు జరిమానా విధించేలా ముసాయిదా బిల్లుకు ఆమోదం తెలిపింది. లీకేజీ కేసుల విచారణ కోసం ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేసి మూడు నెలల్లోనే తీర్పు వచ్చేలా చర్యలు చేపట్టాలని నిర్ణయించడం కూడా స్వాగతించదగిన పరిణామమే. ఇలాంటి నేరాలకు కఠిన శిక్షలు తప్పనిసరి. ఎందుకంటే ఇది ప్రశ్నపత్రం దొంగతనం మాత్రమే కాదు. లక్షలాది మంది విద్యార్థుల శ్రమను, తల్లిదండ్రుల ఆశలను, ప్రభుత్వ నియామక వ్యవస్థపై ప్రజల నమ్మకాన్ని దెబ్బతీసే సామాజిక నేరం. అయితే అసలు ప్రశ్న ఇక్కడే మొదలవుతుంది. లీకేజీ జరిగిన తర్వాత శిక్షించడం గొప్పదా? లేక లీకేజీ జరగకుండా వ్యవస్థను మార్చడం గొప్పదా? సమాధానం స్పష్టంగా రెండో దానికే అనుకూలంగా ఉంటుంది. ఇప్పటికీ అనేక పరీక్షల్లో ప్రశ్నపత్రాల తయారీ, ముద్రణ, రవాణా, భద్రపరిచే ప్రక్రియల్లో మానవ ప్రమేయం అధికంగా ఉంది. ఈ బలహీనతలనే లీకేజీ ముఠాలు అవకాశంగా మార్చుకుంటున్నాయి. అందుకే చట్టంతో పాటు పరీక్షల నిర్వహణలోనూ సమూల మార్పులు అవసరం. దీనికి ఉత్తమ ప్రత్యామ్నాయం సీబీటీ (కంప్యూటర్ బేస్డ్ టెస్ట్) విధానం. ఇందులో ప్రశ్నపత్రాలను ముందుగానే ముద్రించాల్సిన అవసరం ఉండదు. పరీక్ష ప్రారంభానికి కొద్ది నిమిషాల ముందు మాత్రమే అత్యంత భద్రత కలిగిన సర్వర్ ద్వారా ప్రశ్నలు పరీక్షా కేంద్రాలకు చేరతాయి. వేలాది ప్రశ్నలతో కూడిన ప్రశ్నల బ్యాంక్ నుంచి ప్రతి అభ్యర్థికి కంప్యూటర్ యాదృచ్ఛికంగా ప్రశ్నలను ఎంపిక చేస్తుంది. ప్రశ్నల క్రమం, సమాధానాల ఎంపికలు కూడా ఒక్కో అభ్యర్థికి వేర్వేరుగా ఉండేలా రూపొందించవచ్చు. దీంతో సంప్రదాయ ప్రశ్నపత్రాల లీకేజీలకు అవకాశాలు గణనీయంగా తగ్గుతాయి.

భారతదేశంలో ఇప్పటికే జేఈఈ మెయిన్, యూజీసీ నెట్, సీయూఈటీ, బ్యాంకింగ్, ఎస్ఎస్‌సీ, రైల్వే వంటి అనేక జాతీయ స్థాయి పరీక్షలు సీబీటీ (కంప్యూటర్ బేస్డ్ టెస్ట్) విధానంలో విజయవంతంగా నిర్వహిస్తున్నారు. ఈ అనుభవాన్ని ఆధారంగా తీసుకొని రాష్ట్ర స్థాయి ప్రవేశ, నియామక పరీక్షలను కూడా దశలవారీగా ఇదే విధానంలోకి తీసుకురావాలి. దీనితో పాటు ఎండ్-టు-ఎండ్ ఎన్‌క్రిప్షన్, బయోమెట్రిక్ ధృవీకరణ, ఫేస్ రికగ్నిషన్, కృత్రిమ మేధస్సు (ఏఐ) ఆధారిత పర్యవేక్షణ, సురక్షిత బ్రౌజర్లు, సీసీటీవీ నిఘా, డిజిటల్ ఆడిట్ లాగ్స్ వంటి ఆధునిక సాంకేతిక వ్యవస్థలను తప్పనిసరిగా అమలు చేయాలి. ప్రశ్నపత్రాన్ని ఎవరైనా అనధికారికంగా యాక్సెస్ చేయడానికి ప్రయత్నించినా వెంటనే గుర్తించే భద్రతా వ్యవస్థ ఉండాలి. గ్రామీణ ప్రాంతాల వరకు నాణ్యమైన పరీక్షా కేంద్రాలు, వేగవంతమైన ఇంటర్నెట్, శిక్షణ పొందిన సిబ్బంది, బలమైన సైబర్ భద్రతను ప్రభుత్వం కల్పించాలి. కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న కఠిన చట్టం సరైన దిశలో అడుగే. కానీ శిక్ష నేరస్థుడిని శిక్షిస్తుంది. సాంకేతికత నేరం జరిగే అవకాశాన్నే తగ్గిస్తుంది. ఈ రెండూ కలిసినప్పుడే పరీక్షా వ్యవస్థపై విద్యార్థుల విశ్వాసం పునరుద్ధరించబడుతుంది. ప్రశ్నపత్రాల లీకేజీలకు శాశ్వత ముగింపు కావాలంటే చట్టం కఠినంగా ఉండాలి. అంతకంటే కఠినంగా పరీక్షా వ్యవస్థ డిజిటల్‌గా మారాలి. సీబీటీ (కంప్యూటర్ బేస్డ్ టెస్ట్), బలమైన సైబర్ భద్రత, వేగవంతమైన న్యాయవ్యవస్థ, పారదర్శక పరీక్షా నిర్వహణ.. ఈ నాలుగు స్తంభాలపైనే భారత పరీక్షా వ్యవస్థ భవిష్యత్తు నిలవాలి. అప్పుడే నిజాయితీగా చదివిన ప్రతి విద్యార్థి శ్రమకు న్యాయం జరుగుతుంది.



శ్రీశైలం దూడం
ఫ్రీలాన్స్ జర్నలిస్ట్
9133947176

## రచయితలకు ఆహ్వానం!

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. PRGI REGD No.: TGTEL/25/A1385 . Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.